


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 | సంచిక : 346 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | గురువారం 31 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

# కొత్తగా మరో డిస్కం..

## విద్యుత్ విభాగం ప్రక్షాళనకు సంస్కరణలు

## అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

**రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సౌర విద్యుత్ వినియోగించేలా చూడాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సౌరఫలకాలు ఏర్పాటు చేయాలి. జిల్లాలవారీగా అనువైన భవనాలను గుర్తించే బాధ్యతను కలెక్టర్లకు అప్పగించాలి. సీఎం రేవంత్**



హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విద్యుత్ విభాగం ప్రక్షాళనకు అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఇంధనశాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఇందులో పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న ఉత్తర, దక్షిణ డిస్కంలు వాణిజ్య కార్యకలాపాలు చేపడతాయని, కొత్త డిస్కం కేవలం ప్రభుత్వం సబ్సిడీపై అందించే విద్యుత్ పథకాలను నిర్వహించేలా పని విభజన చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవసాయంతో పాటు ఇళ్లు, పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలన్నీ కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా దీని పరిధి ఉండాలన్నారు. పాత డిస్కంల పనితీరు మెరుగుపడితే జాతీయస్థాయిలో రేటింగ్ పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడున్న రెండు డిస్కంల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు సంస్కరణలు తప్పనిసరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాటి పునర్వ్యవస్థీకరణతో పాటు రుణ భారం తగ్గించాలని చెప్పారు. గతంలో 10 శాతం వడ్డీకి తీసుకున్న రుణాలతో డిస్కంలు డీలాపడ్డాయని, తక్కువ వడ్డీకి కొత్త రుణాలు తీసుకుని పాతవాటిని తీర్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయానికి సౌర విద్యుత్ అందించాలని, ఇందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. సచివాలయంలో వాహనాల పార్కింగ్ నిమిత్తం సోలార్ రూఫ్‌టాప్ షెడ్లు, వాటి చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందిర సౌర గిరి జలవికాసం పథకాన్ని రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ తండాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని సీఎం ఆదేశించారు. మూడేళ్లలో 2.10 లక్షల మంది గిరిజన రైతులకు పథకాన్ని వర్తింపజేయాలని, 6 లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ పంపుసెట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భేటీ

- జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సమావేశం
- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్
- పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్‌పై చర్చ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో వారు భేటీ అయ్యారు. తెలంగాణలో పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాడేందుకు కార్యాచరణపై చర్చించారు. దాదాపు గంటన్నర పాటు ఈ సమావేశం కొనసాగింది. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణ వీరి మధ్య చర్చకు వచ్చింది. ఆగస్టు 5న పార్లమెంటు ఉభయసభల్లో ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టాలని నిర్ణయించారు. మరుసటి రోజు అంటే 6న జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు, బీసీ సంఘాల నేతలు పాల్గొంటారు. 7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందజేస్తారు. ఇందుకోసం ప్రత్యేక రైలులో ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి వెళతారు. ఢిల్లీ పర్యటన తర్వాత పాదయాత్ర యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు.

## భారత్‌పై 25 శాతం సుంకాలు విధించిన డొనాల్డ్ ట్రంప్

- ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించిన ట్రంప్
- అమెరికా వస్తువులపై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తోందన్న ట్రంప్
- మిత్ర దేశమైనప్పటికీ భారత్‌తో వ్యాపారం తక్కువేనని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్::అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై చర్యలు చేపట్టారు. భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ఆయన వెల్లడించారు.

వివరాలు 2లో..

### ప్రధాని ప్రసంగంలో స్పష్టత లేదు..

## రాహుల్, ప్రియాంక ప్రశ్నలకు సమాధానం చెప్పలె

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



- సీజ్ ఫైర్ కి ఒప్పుకోవడంలో మతలబేంటి?
- అమాయకుల ప్రాణాలతో బీజేపీ రాజకీయాలు

హైదరాబాద్ పెన్ పవర్: పార్లమెంట్లో రెండు గంటల పాటు సుదీర్ఘంగా మాట్లాడిన ప్రధాని ప్రసంగంలో స్పష్టత లేదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృ ష్ణ ఆరోపించారు. లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ప్రియాంకగాంధీపహల్గాం ఉగ్రదాడిపై లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పలేక పోయారని విమర్శించారు. భారత్, పాకిస్తాన్

వివరాలు 2లో..

## విజయవంతంగా కక్ష్యలోకి 'నైసార్'

- నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన ఉపగ్రహందం నైసార్
- నైసార్ ను మోసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్16
- ప్రయోగం విజయవంతమైందన్న ఇస్రో



హైదరాబాద్ పెన్ పవర్:అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సంయుక్తంగా రూపొందించిన నైసార్ ఉపగ్రహాన్ని మోసుకుంటూ, భారత వాహన నౌక జీఎస్ఎల్వీ-ఎఫ్16 నింగిలోకి దూసుకెళ్లింది.

వివరాలు 2లో..

## చంద్రుడి వైపు దూసుకెళుతున్న గ్రహశకలం.. ఢీ కొడితే భూమిపైనా ప్రభావం!

- 15 అంతస్తుల భవనమంత పెద్దగా ఉందన్న నాసా
- ఈ గ్రహశకలం ఢీ కొంటే చంద్రుడిపై భారీ గుంత ఏర్పడుతుందంటున్న శాస్త్రవేత్తలు
- గ్రహశకలం మార్గాన్ని పరిశీలిస్తున్న నాసా జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్

పెన్ పవర్ డెస్క్:అంతరిక్షంలో ఓ గ్రహశకలం చంద్రుడి వైపు దూసుకెళుతోందని నాసా శాస్త్రవే త్తలు పేర్కొన్నారు. దాదాపు 15 అంతస్తుల భవన పరిమాణంలో ఈ గ్రహశకలం ఢీ కొడితే చంద్రుడి ఉపరితలంపై

వివరాలు 2లో..



## నాగార్జున సాగర్‌కు జలకళ.. పోటెత్తిన భారీ వరద..26గేట్లు ఎత్తివేత

హైదరాబాద్ పెన్ పవర్: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వదర పోటెత్తింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు డ్యాంలోకి భారీగా వరద నీరు వచ్చిచేరుతోంది. దీంతో ప్రాజె క్టు నిండుకుండలా కనిపిస్తోం ది. ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.



వివరాలు 2లో..

## కాంగ్రెస్ హయాంలో ఢిల్లీ, వారణాసి, ముంబై.. ఇలా ఎన్నో చోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి



- పేలుళ్లు జరగని నగరమే లేదని ఆగ్రహం
- ఉగ్రవాదాన్ని చూసీ చూడనట్లు వ్యవహరించారని ఆరోపణ
- మనపై బుల్లెట్లు పేల్చిన వారికి కాంగ్రెస్ బిర్యానీ పెట్టిందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో ఢిల్లీ, వారణాసి, ముంబై వంటి నగరాలలో బాంబు పేలుళ్లు సంభవించాయని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. రాజ్యసభలో జరుగుతున్న 'ఆపరేషన్ సిందూర్' పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూపీఏ హయాంలో బాంబు పేలుళ్లు జరగని నగరమే లేదని పేర్కొన్నారు. వారి పాలనలో

వివరాలు 2లో..

## బీజేపీలో సినీ నటి ఖుష్బూకు మరో కీలక పదవి!

- తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమించిన బీజేపీ
- జేపీ నడ్డా ఆమోదంతో కొత్త కార్యవర్గాన్ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన
- ఖుష్బూ సహా 14 మంది ఉపాధ్యక్షులుగా నియామకం

హైదరాబాద్ పెన్ పవర్: ప్రముఖ సినీ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బూకు పార్టీలో కీలక పదవి లభించింది. ఆమెను తమిళనాడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ బీజేపీ నిర్ణయం తీసుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదంతో కొత్త రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలు 2లో..



## మరిన్ని దేశాలకు సునామీ ముప్పు...

- రష్యాలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 8.8 తీవ్రత నమోదు
- పలు దేశాల్లో 3 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుతో అలలు
- అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ తాజా అలర్ట్

వివరాలు 2లో..




## నాతో డీల్ చేయండి.. ప్రధానమంత్రి వస్తే ఇబ్బంది అవుతుంది!

- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్యసభలో చర్చ
- చర్చకు ప్రధానమంత్రి హాజరు కాకపోవడాన్ని ప్రశ్నించిన ఖర్గే
- సభ నుంచి వాకౌట్ చేసిన విపక్షాలు

హైదరాబాద్ పెన్ పవర్: 'ఆపరేషన్ సిందూర్'పై రాజ్యసభ లో చర్చ సందర్భంగా కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనతో డీల్ చేయాలని, ప్రధానమంత్రి వస్తే ఇంకా ఇబ్బందిపడతారంటూ విపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనకపోవడాన్ని విపక్షాలు ప్రశ్నించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీ హాజరుకాకపోవడాన్ని ప్రశ్నించారు. అమిత్ షా ప్రసంగిస్తుండగా విపక్షాలు వాకౌట్ చేశాయి. అమిత్ షా మాట్లాడేందుకు



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# సిగాచీ.. ఎంత మోసం.. ఎంత వంచన? పరిహారం ఎక్కడ?

సంగారెడ్డి జిల్లాలో జరిగిన సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో యాభై ఆరు మంది కార్మికులు చనిపోయారు. ఇందులో 46 మంది కార్మికులకు సంబంధించిన మృతదేహాలు, అవశేషాలు దొరకగా, మరో ఎనిమిది మందికి సంబంధించిన ఆనవాళ్లు కూడా లభించలేదు. సిగాచీ పరిశ్రమ యాజమాన్యంతో పాటు ప్రభుత్వం కూడా ఆ ఎనిమిది మంది చనిపోయి ఉంటారని ప్రకటించింది. అయితే సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా ఉత్తర్ ప్రదేశ్, బీహార్, ఒడిశాకు చెందిన కార్మికులు కూడా ఉన్నారు. ప్రమాదం జరిగిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాదస్థలాన్ని సందర్శించి మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని కోరారు.

**డెత్ సర్టిఫికెట్లు కూడా...**

అందుకు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం కూడా అంగీకరించి తాము కోటి రూపాయలు మృతి చెందిన వారి కుటుంబాలకు చెల్లిస్తామని, గాయపడిన వారికి ఉచితంగా తమ పరిశ్రమ తరుపున వైద్యసాయం అందిస్తామని చెప్పింది. అయితే ఇప్పటి వరకూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం కోటి రూపాయల పరిహారం చెల్లించలేదు. అయితే కొందరికి మాత్రం పదిహేను లక్షల రూపాయలు మాత్రం ఇచ్చి చేతులు దులుపుకుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆచూకీ లభించని ఎనిమిది మందికి సంబంధించిన వారికి డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదు. ప్రమాదం జరిగి నెల రోజులవుతున్నా ఇంతవరకూ పరిహారం చెల్లించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అగ్రిమెంట్ పై సంతకం చేయించుకుంటూ...**

మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఇటు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోవడం లేదని, అటు ప్రభుత్వం కూడా ప్రమాదం జరిగి ఇన్ని రోజులవుతుండటంతో దాని ఊసే మరిచిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిగాచీ పరిశ్రమ ప్రమాదంపై ఏర్పాటయిన నిపుణుల కమిటీ ఇప్పటి వరకూ ప్రభుత్వానికి నివేదిక అందచేయలేదు. ప్రమాదానికి గల కారణం పాత మిషనరీ అని కార్మికులు చెబుతున్నప్పటికీ ఇప్పటి వరకూ సిగాచీ పరిశ్రమ యాజమాన్యానికి సంబంధించి ఈ ఘటనలో ఎవరినీ అరెస్ట్ చేయకపోవడంపై విపక్షాలు సయితం ప్రశ్నిస్తున్నాయి. పైగా మృతి చెందిన కార్మికుల కుటుంబాలలో కొందరికి పదిహేను లక్షలు ఇచ్చి వారిచేత అగ్రిమెంట్లపై సంతకం కూడా సిగాచీ పరిశ్రమ యాజమాన్యం పెట్టించుకుందని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని కార్మికుల కుటుంబాలు కోరతున్నాయి.

**గాయపడిన వారికి...**

ప్రమాదంలో గాయపడిన వారు కోలుకుంటున్నారు. మూడు నెలల పాటు పరిశ్రమను మూసివేస్తున్నట్లు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం ప్రకటించింది. అయితే గాయపడిన వారికి ఇంత వరకూ వారు కుటుంబాలు ఎలా జీవనం సాగిస్తారన్న దానిపై కూడా యాజమాన్యం క్లారిటీ ఇవ్వలేదు. ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావిడి చేసి తామే అంతా చూసుకుంటామన్న సిగాచీ పరిశ్రమ యాజమాన్యం తర్వాత మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదన్నవిమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. యాజమాన్యం తప్పుకు కార్మికుల కుటుంబాలు బలవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## సమాచార శాఖ ఓపెన్ టాప్ వాహనానికి ఆగస్టు 18న బహిరంగ వేలం

విశాఖపట్నం, జూలై 29 :- సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖపట్నం కార్యాలయంలోని ఓపెన్ టాప్ వాహనానికి ఆగస్టు 18వ తేదీ ఉదయం 11.00 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. కాలపరిమితి ముగిసి, నిరుపయోగంగా ఉన్న స్వరాజ్ మజ్దా ఓపెన్ టాప్ ఏపీ 31 టీయు 1495 (2008 మోడల్) వాహనాన్ని యధావిధిగా బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5,000 ధరావతు సొమ్ము చెల్లించాలని, వేలం దక్కించుకున్న వారు జీఎస్టీతో పాటు మొత్తం నగదు వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. కార్యాలయ పని వేళల్లో వాహనాన్ని పరిశీలించుకోవచ్చన్నారు. వేలం వేయుటకు, రద్దు పరుచుటకు కార్యాలయ అధికారికి అధికారం ఉందని, వివరాలకు ఫోన్ 9642714155 నంబరును సంప్రదించవచ్చని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ సూచించారు.

**జారీ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, విశాఖపట్నం.**

# భారత్‌పై 25 శాతం సుంకాలు విధించిన డొనాల్డ్ ట్రంప్

- మొదటి పేజీ తరువాయి

అమెరికా వస్తువులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ సైనిక ఉత్పత్తులను, ముఖ్యంగా చమురును ఎక్కువగా దిగుమతి చేసుకుంటోందని ఆయన తెలిపారు. వాటిపై పెనాల్టీ విధించనున్నట్లు వెల్లడించారు. మిత్రదేశమైనప్పటికీ భారత్‌తో తమ వ్యాపారం తక్కువగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా విధించిన గడువు మేరకు భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఇంకా కుదరలేదని ఆయన తెలిపారు. ఈ కారణంగా సుంకాన్ని విధించినట్లు వెల్లడించారు. అయితే, ఆగస్టు 1 వరకు చర్చల్లో ఫలితం తేలకుంటే సుంకాన్ని విధిస్తానని ప్రకటించిన ట్రంప్, గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని మార్చుకొని సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. భారత్ రష్యాతో స్నేహ సంబంధాలు కొనసాగించడం, కొన్ని రోజులుగా రష్యా నుంచి ముడి చమురు, ఆయుధాలను కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

## చంద్రుడి వైపు దూసుకెళుతున్న గ్రహశకలం..

# ఢీ కొడితే భూమిపైనా ప్రభావం!

- మొదటి పేజీ తరువాయి

800 అడుగుల మేర భారీ గుంత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం భూమిపైనా పడుతుందని అంచనా వేశారు. నాసా జేమ్స్ వెబ్ స్పేస్ టెలీస్కోప్ గుర్తించిన ఈ గ్రహశకలాన్ని 2024 వైఆర్4 గా వ్యవహరిస్తున్నారు. ఇది 2032 చంద్రుడిని తాకనుందని చెబుతున్నారు. అయితే, ఈ గ్రహశకలం చంద్రుడిని ఢీ కొట్టే అవకాశం స్వల్పంగానే ఉందని వివరించారు.

**చంద్రుడిని ఢీ కొడితే ఏంజరగనుంది..**

2024 వైఆర్4 గ్రహశకలం చంద్రుడిని ఢీ కొడితే భారీ విస్ఫోటనం ఏర్పడుతుందని, గ్రహశకలం ముక్కలైపోతుందని నాసా శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ గ్రహశకలం ముక్కలు భూమివైపు వస్తాయని, వాటివల్ల భూ కక్ష్యలో తిరగుతున్న ఉపగ్రహాలకు ముప్పు పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కటీ ఒక్కో మీటర్ పరిమాణంలో ఉండే ఈ గ్రహశకలం ముక్కలు కనుక

ఢీ కొడితే ఉపగ్రహాలు దెబ్బతింటాయని తెలిపారు. ప్రస్తుతం భూమి చుట్టూ సుమారు 10 వేలకు పైగా యాక్టివ్ ఉపగ్రహాలు తిరుగుతున్నాయని, మరో 25 వేల వరకు అంతరిక్ష వ్యర్థాలు ఉన్నాయని నాసా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అయితే, 2024 వైఆర్4 గ్రహశకలం చంద్రుడిని ఢీ కొట్టే అవకాశం స్వల్పంగానే ఉండడంతో ముప్పు ఉండకపోవచ్చని వివరించారు.

# విజయవంతంగా కక్ష్యలోకి 'నైసార్'

- మొదటి పేజీ తరువాయి

అత్యంత శక్తిమంతమైన అబ్జర్వేషన్ శాటిలైట్ నైసార్ ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఈ ఉపగ్రహం బరువు 2,393 కిలోలు. నైసార్ అంటే నాసా ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్. ఇందులో ఉండే రెండు భారీ డిష్ ల వంటి నిర్మాణాలు భూమిపైకి మైక్రోవేవ్, రేడియో వేవ్ సంకేతాలు పంపుతాయి. ఆ సంకేతాలు భూమిని తాకి పరావర్తనం చెంది తిరిగి శాటిలైట్ ను చేరతాయి. నైసార్ లోని సాంకేతిక వ్యవస్థలు ఆ సంకేతాలను విశ్లేషించి చిత్రాలుగా రూపొందిస్తాయి. ప్రకృతి విపత్తులను ఇది ముందుగానే అత్యంత కచ్చితత్వంతో అంచనా వేస్తుందని భావిస్తున్నారు. ఇస్రో అత్యంత చవకగా రాకెట్ ప్రయోగాలు చేపట్టడం గమనించిన నాసా... ఈ ఉపగ్రహ ప్రయోగం కోసం ఇస్రోతో జట్టుకట్టింది.

# మరిన్ని దేశాలకు సునామీ ముప్పు...

**పెన్ పవర్ డెస్క్:**రష్యాలో భారీ భూకంపం సంభవించడంతో ప్రపంచ దేశాల్లోనూ కలకలం రేగింది. 8.8 తీవ్రతతో ప్రకంపనలు రావడంతో పలు దేశాలను సునామీ తాకింది. తాజాగా, అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ మరికొన్ని దేశాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. రష్యా, హవాయి దీవులు, ఈక్వెడార్ 3 మీటర్ల కంటే ఎత్తయిన అలలతో సునామీ వచ్చే అవకాశం ఉంది. జపాన్, చిలీ, కోస్టారికా, పెరు, సోలోమన్ ఐలాండ్స్, కిరిబాటి, సమోవా, ఫ్రెంచ్ పాలినేషియా దీవులు, గ్వామ్, పాల్మిరా ఐలాండ్, మిడ్ వే ఐలాండ్, జాన్ స్టన్ అటోల్, జార్విస్ దీవులకు 1 మీటర్ నుంచి 3 మీటర్ల అలలతో సునామీ వచ్చే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, ఫిజీ, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా, పపువా న్యూగినీ, తైవాన్, ఫిలిప్పీన్స్, నికరాగువా, మెక్సికో, కొలంబియా, పనామా, కుక్ ఐలాండ్స్, అంటార్కిటికా ప్రాంతాలకు 0.3 మీటర్ల నుంచి 1 మీటరు ఎత్తు అలలో సునామీ వచ్చే అవకాశం ఉంది.

చైనా, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, వియత్నాం, బ్రూనై, మలేషియా దేశాలకు 0.3 మీటర్ల కంటే తక్కువ ఎత్తుతో అలలు వచ్చే అవకాశం ఉందని అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ వెల్లడించింది.

# సింగపూర్ పర్యటన సూపర్ సక్సెస్

పెట్టుబడులను ఆకర్షించటం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. మంత్రులు నారా లోకేశ్, పి.నారాయణ, టీజీ భరత్ సహా ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సింగపూర్ లో నాలుగు రోజుల పాటు అవిశ్రాంతంగా వివిధ సమావేశాలు, రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొన్నారు. సింగపూర్ లోని ప్రతిష్మాత్మక ప్రాజెక్టులను సందర్శించి వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం చేశారు. పర్యటనలో మొత్తం 26 కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, మంత్రులు హాజరయ్యారు. పర్యటన మొదటి నుంచి చివరి రోజు వరకూ క్షణం తీరిక లేకుండా ఆసాంతం రాష్ట్ర అభివృద్ధి కాంక్షతో నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరిపారు. సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాన మంత్రి, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్, అలాగే వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి టాన్ సీ లెంగ్, సెక్యూరిటీ, హోం వ్యవహారాల మంత్రి కె.షణ్ముగం తదితరులతో సీఎం సమావేశమయ్యారు. ఏపీ-సింగపూర్ మధ్య సహకారాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి

అభివృద్ధిలోనూ భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు వచ్చినట్టు అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించి చెప్పారు. నవంబరు 14-15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధుల్ని సీఎం ఆహ్వానించారు. సింగపూర్ లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే పర్యటన ఆసాంతం ముఖ్యమంత్రి బృందానికి సహాయ సహకారాలు అందించారు.

**నిర్విరామంగా సమావేశాలు-సందర్శనలు**

మరోవైపు సుర్బానా జురాంగ్, సెంబ్ కార్ప్, ఎస్ఐఏ ఇంజనీరింగ్, ఏఐ సింగపూర్, కెప్పెల్ కార్పొరేషన్, జీఐసీ, ఎస్ఎంబీసీ, కాపిటాల్యాండ్ ఇన్వెస్ట్మెంట్, ఎవర్సెండై ఇంజనీరింగ్, టామ్ సెక్, విల్మర్, టీవీఎస్ మోటార్స్, మండై వైల్డ్ లైఫ్, అదానీ పోర్ట్స్ తదితర కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలోని అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల పాలసీల గురించి సీఎం అవగాహన కల్పించారు. భారతదేశంలో పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోకి వచ్చే కంపెనీలకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు సీఎం చెప్పారు. పట్టణాభివృద్ధి, ఐటీ, ఏఐ, ఫినటెక్, మారిటైమ్, పోర్ట్స్ మౌలిక సదుపాయాలపై నిర్వహించిన వేర్వేరు రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి ఇక్కడి వనరుల్ని వినియోగించుకుని పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామిక వేత్తలను కోరారు. దీంతో పాటు సింగపూర్ లోని ప్రతిష్టాత్మక హౌసింగ్ ప్రాజెక్టు బిడదారి ఎస్టేట్, జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్, టువాస్ పోర్టు, సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ను సీఎం బృందం సందర్శించింది. ఆయా ప్రాజెక్టుల్లో అమలు చేస్తోన్న అత్యుత్తమ, ఆధునిక విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించింది.

**ఆకట్టుకున్న తెలుగు డయాస్పోరా**

మొత్తం పర్యటనలో సింగపూర్ లో నిర్వహించిన 'తెలుగు డయాస్పోరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియా' సమావేశం విశేషంగా నిలిచింది. పర్యటన ఆరంభంలో సింగపూర్ తో పాటు సమీపంలోని ఐదు దేశాల నుంచి వచ్చిన తెలుగువారు ఆత్మీయ,

అభిమానాలతో ముఖ్యమంత్రి బృందానికి ఘనస్వాగతం పలికారు. పర్యటన చివరి రోజైన బుధవారం కూడా సీఎం చంద్రబాబు, మంత్రులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్రానికి తిరుగు ప్రయాణం అయ్యారు. సింగపూర్ నుంచి బయల్దేరిన సీఎం రాత్రి 10.30 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెంటనే బయల్దేరి రాత్రికే విజయవాడ చేరుకోనున్నారు.

## ప్రధాని ప్రసంగంలో స్పష్టత లేదు.. రాహుల్, ప్రియాంక ప్రశ్నలకు సమాధానం చెప్పలె

- మొదటి పేజీ తరువాయి

మధ్య కాల్పుల విర మణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు ఖండించలేదన్నారు.

ఆయన సీజ్ ఫైర్ కు ఒప్పుకోవడంలోని మతలబు ఏమిటని ప్ర శ్నించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఉన్న ధైర్యంలో సగం కూడా ప్రస్తుత ప్రధానికి లేదన్నారు. ఆయన నేతృత్వంలో దేశం సురక్షితంగా లేదని పహల్గాం ఘటనతో రుజువు అయిందన్నారు. పహల్గాం ఉగ్రదా డిలో మరణించిన 26 మంది పర్యాటకుల ప్రాణాలతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.

## నాగార్జున సాగర్‌కు జలకళ.. పోటెత్తిన భారీ వరద..26గేట్లు ఎత్తివేత

- మొదటి పేజీ తరువాయి

బుధవారం (జూ లై30) సాయంత్రానికి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 2లక్షల 82వేల 364 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 586 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 300.3200.టీఎంసీలుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టుమొత్తం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో 16 గేట్లు 5ఫీట్ల మేర, 10 గేట్లు 10ఫీట్ల మేర ఎత్తి 2లక్షల 65వేల 08 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు అధికారు. ఇక ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్తు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

ద

# బీజేపీలో సినీ నటి ఖుష్బూకు మరో కీలక పదవి!

- మొదటి పేజీ తరువాయి

తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఖుష్బూ సుందర్ సహా 14 మంది నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురు, రాష్ట్ర కార్యదర్శులుగా మరో 14 మందితో కూడిన జాబితాను నాగేంద్రన్ తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. ఖుష్బూ ప్రస్తుతం జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలుగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా, ఆమె పార్టీ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా కూడా కొనసాగుతున్నారు.

## నాతో డీల్ చేయండి.. ప్రధానమంత్రి వస్తే ఇబ్బంది అవుతుంది!

- మొదటి పేజీ తరువాయి

నిలబడగానే విపక్షాలు ఆందోళనకు దిగాయి. సభలో ప్రధానమంత్రి మాట్లాడాలని డిమాండ్ చేశాయి. పీఎం.. పీఎం అంటూ నినాదాలు చేశాయి. అమిత్ షా స్పందిస్తూ, నరేంద్ర మోదీ కార్యాలయంలోనే ఉన్నారని, ఈ వ్యవహారంపై అన్ని విషయాలను తనతో చెప్పారని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రధాని సభకు రాకపోతే సభను అవమానించడమేనని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ప్రాంగణంలోనే ఉండి సభకు రాకపోవడం సరికాదని ఆయన అన్నారు. అమిత్ షా స్పందిస్తూ, ప్రధానమంత్రి గురించి అడిగే వారి బాధను తాను అర్థం చేసుకోగలనని, కానీ ఆయన కార్యాలయంలోనే ఉన్నారని పేర్కొన్నారు. అన్ని విషయాలపై తాను మాట్లాడి, పూర్తి స్పష్టత ఇస్తున్నప్పుడు ప్రధానమంత్రి నుంచి వినాలని అనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధానమంత్రి వస్తే మీకు ఇంకా ఇబ్బంది అవుతుందని సున్నితంగా హెచ్చరించారు.

# కాంగ్రెస్ హయాంలో ఢిల్లీ, వారణాసి, ముంబై.. ఇలా ఎన్నో చోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి

- మొదటి పేజీ తరువాయి

ఉగ్రవాదాన్ని చూసీచూడనట్లు వ్యవహరించారని ఆరోపించారు. పహల్గామ్ దాడి, తదనంతర ఆపరేషన్ సిందూర్‌పై ప్రశ్నిస్తున్నవారు గతంలోని తమ పాలనను గుర్తుకు తెచ్చుకోవాలని కాంగ్రెస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అప్పట్లో పేలుళ్లు జరగని నగరమంటూ ఏదీ లేదని అన్నారు. వందలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మనపై బుల్లెట్లు పేల్చిన వారికి కాంగ్రెస్ బిర్యానీ పెట్టిందని వ్యంగ్యంగా అన్నారు. ఉగ్ర దాడులు చేసిన వారితో వాణిజ్య సంబంధాలు పెంచుకున్నారని ఆరోపించారు. పాకిస్థాన్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం అమలు నిలిపివేతను కాంగ్రెస్ అర్థం చేసుకోలేకపోయిందని విమర్శించారు. దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# నెల్లూరులో వైయస్ జగన్ పర్యటనను అడ్డుకునే కుట్ర

- జిల్లాలో 2 వేల మందికి నోటీసులిచ్చిన పోలీసులు
- కూటమి సర్కార్‌పై వైయస్ఆర్‌సీపీ నేతలు ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఫైర్
- నెల్లూరు వైయస్ఆర్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో రాక్షస పాలన
- పోలీసులను అడ్డం పెట్టి వైయస్ఆర్‌సీపీ నేతలకు బెదిరింపులు
- వైయస్ జగన్ నెల్లూరు పర్యటనను అడ్డుకోవడమే చంద్రబాబు లక్ష్యం
- ఎన్ని కుట్రలు పన్నినా వైయస్ జగన్‌ను నిలువరించలేరు
- స్పష్టం చేసిన ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి



**నెల్లూరు: పెన్ పవర్, జులై 30** నెల్లూరులో మాజీ సీఎం వైయస్ జగన్ పర్యటనను అడ్డుకునేందుకు చంద్రబాబు డైరెక్షన్‌లో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వైయస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ కుట్రలో భాగంగా పోలీసులు ఇప్పటికే జిల్లాలో రెండు వేల మందికి నోటీసులు జారీ చేశారని మండిపడ్డారు. మహిళా నేతల ఇంటికి అర్థరాత్రి సమయాల్లో వెళ్ళి నోటీసుల పేరుతో వారిని భయబ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైయస్ జగన్ పర్యటనకు ఎవరూ వెళ్ళకూడదంటూ ప్రభుత్వమే అడ్డుకోవడం చూస్తుంటే అరచేతిని అడ్డం పెట్టి సూర్యుడిని అడ్డుకోవాలనుకునే అవివేకమే కనిపిస్తోందని అన్నారు. ఇంకా వారేమన్నారంటే...

**ప్రభుత్వ ఒత్తిడి తట్టుకోలేక ఎస్పీ సెలవుపై వెళ్లిపోయారు: వైయస్ఆర్‌సీపీ జనరల్ సెక్రటరీ సతీష్ కుమార్ రెడ్డి**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ గురువారం నెల్లూరు పర్యటనకు రానున్నారు. అక్రమ కేసుల్లో జైలుపాలైన మా పార్టీ నాయకులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించడానికి రావాలని నిర్ణయించుకుంటే పోలీసుల ఆంక్షల వల్ల రెండుసార్లు వాయిదా పడింది. హెలిప్యాడ్ కి స్థలం కేటాయింపు దగ్గర నుంచి నాయకులను అడ్డుకోవడం వరకు అడుగడుగునా వైయస్ జగన్‌ని రాకుండా చేయాలని కుట్రలు చేస్తున్నట్టుగా స్పష్టంగా కనిపిస్తోంది. వైయస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఇప్పటికే నెల్లూరులో 2 వేల మందికి పైగా నోటీసులిచ్చారు. పట్టాభిరామిరెడ్డి అనే 75 ఏళ్ల వృద్ధుడికి కూడా నోటీసులిచ్చారు. అర్ధరాత్రి 1.26 గంటలకు టూటౌన్ ఎస్సై ఒక మహిళ కార్పొరేటర్‌ను నిద్రలేపి నోటీసులిచ్చి వెళ్లారు. వారితో కనీసం ఒక మహిళా కానిస్టేబుల్‌ను కూడా తీసుకురాలేదు. జగన్ కార్యక్రమానికి వెళితే మీ వాహనాలను సీజ్ చేస్తామని కిరాయి వాహనాల యజమానులకు నోటీసులిచ్చారు. ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను చూడలేక, వాటిలో భాగంకాలేక, అధికార పార్టీ పెట్టే ఒత్తిడిని తట్టుకోలే జిల్లా ఎస్పీ సెలవుపై వెళ్లారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రేపటి వైయస్ జగన్ పర్యటను ఆపలేరు. వైయస్ జగన్ కోసం వచ్చే జన ప్రభంజనాన్ని అడ్డుకోలేరు. వైయస్ పర్యటనలకు జనాన్ని రాకుండా అడ్డుకోవడమంటే అరచేతితో సూర్యకిరణాలను ఆపాలనుకోవడమే అవుతుంది.

**ప్రశాంతమైన నెల్లూరులో ప్రతీకార రాజకీయాలకు తెరదీశారు:**

దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉన్న నెల్లూరు జిల్లాలో ప్రతీకార రాజకీయాలకు తెరదీస్తున్నారు. సీనియర్ నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటి మీద టీడీపీ గూండాలు దాడి చేసి ఫర్నీచర్ పగలగొట్టి కారు మీద పెట్రోల్ పోసి తగలబెడితే, ఇంటిని ధ్వంసం చేస్తే నిందితుల మీద పోలీసులు కనీసం కేసులు కూడా నమోదు చేయలేదు. మరీ విచిత్రంగా దాడి జరిగిన సమయంలో పోలీసులే అక్కడే ఉండి కూడా గూండాలను అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఇదంతా చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది. ప్రజా సమస్యల మీద వైయస్ జగన్ బయటకొచ్చి మాట్లాడుతుంటే ఈ ప్రభుత్వం తట్టుకోలేకపోతోంది. గుంటూరు, పొదిలి, సత్తెనపల్లి, బంగారుపాళ్యం పర్యటనలకు వెళితే అక్కడి నాయకులను అక్రమంగా నిర్బంధించారు. పర్యటన తర్వాత వందలాది మంది వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు నమోదు చేశారు. ఆఖరుకి ప్రమాదవశాత్తు జరిగిన మరణాన్ని కూడా వైయస్ జగన్ మీదకి నెట్టి క్షుద్ర రాజకీయం చేశారు. ప్రజా సమస్యలను వినిపిస్తున్న సాక్షి ఛానెల్ మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఎంతసేపటికీ వైయస్ జగన్‌ని అడ్డుకోవాలని, వైయస్ఆర్‌సీపీని లేకుండా చేయాలనే ఆరాటం తప్ప, ఓటేసిన ప్రజలకు న్యాయం చేద్దామని, ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకుందామన్న ఆలోచన చంద్రబాబుకి, లోకేష్‌కి ఉన్నట్టు కనిపించడం లేదని ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు.

**వైయస్ జగన్ పర్యటనను అడ్డుకోలేరు: ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి**

గత వారం పది రోజులుగా నెల్లూరులో నెలకొన్న పరిస్థితులు చూస్తే కూటమి ప్రభుత్వంలో జరుగుతున్నది రాక్షస పాలనకు నిదర్శనంగా నిలుస్తుంది. నెల్లూరులో జిల్లాలో మా పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ పర్యటనను అడ్డుకోవడానికి కూటమి నాయకులు చేయని ప్రయత్నం లేదు. వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు బనాయించి కార్యక్రమానికి రాకుండా చేయాలని చూస్తున్నారు. హెలిప్యాడ్ కి అనుమతుల విషయంలోనూ పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. ఎన్ని కుట్రలు చేసినా వైయస్ జగన్ పర్యటనను అడ్డుకోలేరు. దేశంలోనే అత్యంత ప్రజాధారణ పొందిన నాయకుడు వైయస్ జగన్‌ను కలవనివ్వకండా జనంను ఆంక్షల పేరుతో కట్టడి చేయాలనుకోవడం చంద్రబాబు అవివేకం. ప్రజలు స్వచ్ఛందంగా ఆయన వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారనేందుకు గతంలో జరిగిన పర్యటనలే నిదర్శనం. ప్రశాంతంగా జరిగే పర్యటనలను కావాలనే రెచ్చగొట్టి, కార్యకర్తలను, అభిమానులు ఇబ్బందిపెట్టి విఫలం చేయాలని పోలీసులను పావులుగా చంద్రబాబు, లోకేష్‌లు వాడుకుంటున్నారని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.

# ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం అవగహన సదస్సు






**ములగాడ, పెన్ పవర్, జులై 30** :58 వార్డ్ శ్రీహరిపురం , సబ్ స్టేషన్ నందు

విదేశీ తరహాలో విశాఖ నగరంలో కూడా భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్లు పనులను ప్రారంభించిన ప్రభుత్వ విప్ గణబాబు తదుపరి ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం గృహ వీనియోగదారులకు అవగహన సదస్సు లొలి ముఖ్య అతిధిగా పాల్గొవడం జరిగింది.

గణబాబు మాట్లాడుతూ పథకం వలన ప్రతి ఇంటికి సోలార్ యూనిట్ వినియోగించడం వలన అతి తక్కువ కరెంట్ బిల్లు వస్తుందని అన్నారు తిరిగి మీకు విద్యుత్ సంస్థ చెల్లిస్తుంది సోలార్ రూఫ్ టాప్ ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసు కోవాలని కోరారు సోలార్ ఏర్పాటుకు బ్యాంకు లు నుంచి రుణాలు ప్రభుత్వం నుంచి రాయితీ పొందవచ్చు అని అన్నారు

ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంగ ప్రశాంతి వార్డు కార్పొరే టర్ గల్లా చిన్న వార్డు అధ్యక్షులు కోరాడ శ్రీను , మజ్జి సోమేశ్ , మజ్జి మాలి నాయుడు , మాత శ్రీను , హరి మరియు నక్క లక్ష్మణరావు , పోత బత్తుల శ్రీను , జోజి , మొదలగున్న నాయకులు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నేడు నిత్యం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాష్టికాలు

- ఏ మహిళ ప్రశాంతంగా నిద్రపోతోందో చెప్పాలి.
- మహిళలను మోసం చేసే వారికి అండగా మంత్రులు
- మచిలీపట్నంలో మోసపోయిన యువతి జీవితానికి వెల కట్టే యత్నం
- తన అనుచరుడికి అండగా సెటిల్‌మెంట్ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర
- తన కుమార్తెకు న్యాయం చేయాలంటూ బాధితురాలి తల్లి ఆత్మహత్యయత్నం
- మంత్రి కొల్లు రవీంద్ర జోక్యంతో బాధితురాలి విషయంలో పోలీసుల నిర్లక్ష్యం
- రాష్ట్రంలో మహిళల పట్ల కీచకులుగా మారిన కూటమి నేతలు
- ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఫైర్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, జులై 30** :రాష్ట్రంలో కూటమి పార్టీల నేతలే కీచకులుగా మారి మహిళ మానప్రాణాలను, వారి ఆత్మగౌ రవాన్ని హరిస్తున్నారని ఎమ్మెల్సీ, వైయస్ఆర్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం వైయస్ఆర్‌సీపీ నగర పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మచిలీపట్నంలో కొల్లు రవీంద్ర అనుచరుడి కుమారుడు ఒక యువతిని మోసం చేస్తే, సదరు యువతికి న్యాయం చేయకుండా ఆమె జీవితానికి వెలకట్టేందుకు మంత్రి సెటిల్ మెంట్ చేయడం దారుణమని మండిపడ్డారు. చివరికి తన కుమార్తెకు న్యాయం జరగడం లేదంటూ బాధిత యువతి తల్లి ఆత్మహత్యయత్నం చేసినా కూడా కూటమి నేతల మనస్సు కరగడం లేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన నాటి నుంచి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఇంకా ఆమె ఎమన్నారంటే.మచిలీపట్నంలో టీడీపీ నాయకులు, మంత్రి కొల్లు రవీంద్ర అనుచరుడు సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి విలువలతో కూడిన విద్య నేర్పిస్తాను అంటూ హరేకృష్ణ పేరుతో ఒక స్కూల్ నడిపిస్తున్నారు. తన స్కూల్‌లో పనిచే స్తున్న యువతిని సుబ్రహ్మణ్యం కుమారుడు ప్రేమించానంటూ, పెళ్ళి చేసుకుంటానని తీసు కుని వెళ్ళి, నాలుగు రోజుల పాటు బయట తిప్పి, తరువాత తిరిగి ఇంటికి తెచ్చి వదిలేశా డు. తనకు న్యాయం చేయాలని బాధిత యువతి కోరితే దానిపై పంచాయతీ చేయాలని మంత్రి కొల్లు రవీంద్రను ఆశ్రయించాడు. చట్ట ప్రకారం వ్యవహరించాల్సిన మంత్రి కొల్లు రవీంద్ర బాధిత మహిళ జీవితానికి వెలకట్టే ప్రయత్నం చేశాడు. ఇదేనా మహిళల పట్ల సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, మంత్రి కొల్లు రవీంద్రకు ఉన్న గౌరవం. తన కుమార్తెకు అన్యాయం చేస్తున్నారంటూ సదరు యువతి తల్లి పోలీస్ స్టేషన్ ఎదుటే పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించడం వల్ల ఆమె ప్రాణాలతో ఉన్నారు. ఈ ప్రభుత్వంలో తమకు న్యాయం జరగదని భావించి ప్రాణం తీసుకునే పరిస్థితి కల్పించారు. కొల్లు రవీంద్ర ఒక మంత్రి గా ఉండి బాధితుల పట్ల ఇంత దుర్మార్గంగా వ్యవహిరంచడం దారుణం. సదరు యువతకి న్యాయం చేయాల్సిన అవసరం లేదా..? మహిళలకు అన్యాయం జరిగితే బాదితులకు అండగా నిలబడాల్సిన స్థానంలో ఉండి, దోషులకు కొమ్ముకాయడం కూటమి ప్రభుత్వం లోనే కనిపిస్తోంది. ఈ వ్యవహారంలో బాధిత యువతికి న్యాయం చేయకపోతే వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవు. మహిళా హోంమంత్రిగా అనిత ఫెయిల్ హోంమంత్రి అనిత ఒక మహిళ అయి ఉండి, మహిళలపై జరిగే అరాచకాలను పట్టించుకోవడం లేదు. కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని మహిళలు ప్రశాంతంగా నిద్రపోవచ్చని గొప్పగా ప్రకటించా రు. నేడు నిత్యం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాష్టికాలను చూస్తే ఏ మహిళ ప్రశాంతంగా నిద్రపోతోందో చెప్పాలి. తెలుగు దేశంకు చెందిన నాయకులు, కార్యకర్తలే కీచకులుగా మారి మహిళలను వేధిస్తున్నంటే హోంమంత్రిగా ఉండి కూడా అనిత స్పందించడం లేదు. మాజీ సీఎం వైయస్ జగన్‌ను దూషించ డానికే ఆమె పరిమితమయ్యారు. ప్రతిచోటా పోలీసుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోం ది. మహిళల మానప్రాణాలను కాపాడేందుకు ఎటువంటి చర్యలు లేవు. డీజీపీ నుంచి కాని స్టేబుల్ వరకు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికే పరిమితమయ్యారు. దీనివల్ల తప్పుడు పనులు చేసే వారిలో ఎటువంటి భయం కనిపించడం లేదు. అందువల్లే ఈ రాష్ట్రంలో రోజుకు డెబ్బై నుంచి ఎనబై సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

**ఈ సంఘటలకు సమాధానం చెప్పండి:**

ఎవరైనా మహిళలపై చేయి వేస్తే, అదే వారికి చివరి రోజు అంటూ సీఎం చంద్రబాబు, మహిళల జోలికి వస్తే తాట తీస్తాను అంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గతంలో హెచ్చరించారు. అయితే వారి మాటలు ఎక్కడైనా కార్యరూపంలోకి వచ్చాయా అంటే ఒక్కటీ కనిపించడం లేదు. రాప్తాడు నియోజకవర్గంలో పద్నాలుగేళ్ళ దళిత బాలికపై పద్నాలుగు మంది టీడీపీ కార్యకర్తలు ఆరు నెలలుగా లైంగిక వేధింపులకు గురి చేస్తున్నా పోలీసులు కనీసం వారిపై కేసు కూడా నమోదు చేయలేదు. చివరికి వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో దీనిపై ఆందోళలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు నెలల కిందట రాజమండ్రిలో ఫార్మసీ విద్యార్థినిపై టీడీపీకి చెదిన నాయకుడి బంధువు దీపక్ అనే వ్యక్తి చేసిన వేధింపులకు తాళలేక సదరు విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ కుటుంబానికి నేటికీ ప్రభుత్వం న్యాయం చేయలేదు. అలాగే తిరువూరులో టీడీపీ నాయకుడు రమేష్ అనే వ్యక్తి ఒక గిరిజన మహిళను లోబరుచుకునేందుకు ప్రయత్నించిన ఆడియో కూడా వెలుగుచూసినా, అతడిపై ఎటువంటి చర్య లేదు. గుంటూరు జిల్లా తెనాలిలో ఒక దళిత యువతిని టీడీపీ రౌడీషీటర్ నవీన్ దారుణంగా కొట్టడంతో బ్రెయిన్ డెడ్ అయి చనిపోయింది. సీఎం నివాసం ఉంటున్న జిల్లాలో జరిగిన ఈ దుర్ఘటన చంద్రబాబు కనీసం స్పందించలేదు. తిరుపతిలో లక్ష్మీ అనే బాధితురాలిని జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ ఎలా వేధింపులకు గురి చేశాడో మీడియా ద్వారా ప్రజలంతా చూశారు. దీనిపైనా ఎటువంటి చర్యలు లేవు. ఇక టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలం తన దగ్గర పనిచేసే మహిళను లైంగికంగా వేధిస్తే, ఆమె హైదరాబాద్‌కు వెళ్ళి ప్రెస్‌మీట్ పెట్టి ఈ దారుణాన్ని వెల్లడించినా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. టీడీపీ ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్ వేధింపుల వల్ల ఒక మహిళా వీఆర్ఓ ఆత్మహత్యాయత్నం చేసింది. కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే అనుచరులు మహిళా ఫీల్డ్ అసిస్టెంట్‌ను ముడుపులు ఇవ్వాలి, లేదా తమ కామవాంఛలు తీర్చాలంటూ వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేశారు. దీనిపై ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో దళిత సంఘాలు ఆదోళనలు చేశాయి. కర్నూలు జిల్లా ముచ్చిమర్రిలో ఒక తొమ్మిదేళ్ళ బాలికను గ్యాంగ్ రేప్ చేసి, ముక్కలుగా చేసి విసిరేశారు. ఆ బాలిక మృతదేహం నేటికీ లభించలేదు. హోంమంత్రి నివాసం ఉంటున్న విశాఖపట్నంలో ప్రేమోన్మోది నీరజ్ శర్మ ఒక యువతిపై హత్యాయత్నం చేశాడు. ఇతడి వల్ల తనకు హాని ఉందని యువతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కూడా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల సదరు దుండగుడు ఆమెపై హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలన్నీ ఈ ప్రభుత్వ వైఫల్యాలను చాటుతున్నాయి. ఈ సమావేశం లో జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్ శశికళ , రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మళ్ళ దేవి విశాలాక్షి, కార్యదర్శి కొర్ల శిరీష, సంయుక్త కార్యదర్శి బుర్ర విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు బయ్యవరపు రాధ, వరలక్ష్మి, మజ్జి జ్యోతి తదితరులు పాల్గొన్నారు

# మాజీ సీఎం వైయస్ జగన్ పర్యటనలో భద్రత పెంచాలి

**వైయస్ఆర్‌సీపీ తిరుపతి ఇన్‌చార్జ్ భూమన అభినయ్‌రెడ్డి డిమాండ్**

**తిరుపతి: పెన్ పవర్ జులై 30** వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో భద్రత పెంచాలని వైయస్ఆర్‌సీపీ తిరుపతి ఇన్‌చార్జ్ భూమన అభినయ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం భూమన అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నూకతోటి రాజేష్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ...%-%మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనల్లో భద్రతా వైఫల్యం కనిపిస్తోంది. రేపు నెల్లూరు జిల్లాలో మా నాయకుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు భద్రత తగ్గించడంపై అనుమానాలు ఉన్నాయి. దేశంలో ఏడాదికే ఇంత పెద్ద ఎత్తున ప్రజా వ్యతిరేకత కూడగట్టుకోవడం కూటమి ప్రభుత్వానికే చెల్లింది. చిత్తూరు జిల్లాలో బంగారుపాళ్యం పర్యటనలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రేపు నెల్లూరు జిల్లా లో వైయస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు భద్రత పెంచాలి%-% అని భూమన అభినవ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# వైయస్ జగన్‌ను కలిసిన గుత్తా లక్ష్మీ నారాయణ

**పల్నాడు డీఎస్పీ కులం పేరుతో దూషించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన లక్ష్మీనారాయణ**

**అండగా ఉంటానని ధైర్యం చెప్పిన పార్టీ అధినేత**

**తాడేపల్లి: పెన్ పవర్ జులై 30** పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం, రాజుపాలెం మండలం పెదనెమలిపురికి చెందిన వైయస్ఆర్‌సీపీ అభిమాని గుత్తా లక్ష్మీనారాయణ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. గ్రామంలో తొలి నుంచి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానిగా కొనసాగుతుండడాన్ని జీర్ణించుకోలేక పోతున్న పెదనెమలిపురి టీడీపీ నాయకులు, రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తనను తీవ్రంగా వేధించడంతో పాటు, ఒకసారి దాడి చేసి చేయి కూడా విరగ్గొట్టారని లక్ష్మీనారాయణ వైయస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు స్థానిక డీఎస్పీ ఒకరు, ఏకంగా కులాన్ని ప్రస్తావించి, కమ్మ కులంలో పుట్టి, రెడ్డిలకు చెందిన పార్టీలో ఎందుకున్నావని దూషించారని, దీంతో తీవ్ర మనస్థాపం చెందిన తాను, పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించానని చెప్పారు.

దీర్ఘకాల చికిత్స అనంతరం కాస్త కోలుకున్న ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్‌ను కలిశారు. లక్ష్మీనారాయణ యోగక్షేమాలు విచారించిన వైయస్ జగన్, ఆయనకు ధైర్యం చెప్పారు. ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పల్నాడు జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ ఇంఛార్జ్ డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం కార్యదర్శి పి.శివారెడ్డి తదితరులు ఈ సందర్భంగా వైయస్ జగన్‌ను కలిశారు.

# వయో వృద్ధులకు ఆసరాగా నిలిచేందుకు
# తల్లిదండ్రులను, వృద్ధులను గౌరవంగా చూసుకుందాం




- **అభిప్రాయాలు, సూచనలు పంచుకున్న హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులు**
- **కలెక్టరేట్లో తల్లిదండ్రులు, సీనియన్ సిటిజన్ల పోషణ %ు% సంక్షేమ చట్టం-2007పై అవగాహన సదస్సు**

స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, జూలై 30 :తల్లిదండ్రులను, వృద్ధులను ప్రేమతో చూసుకుం దామని, అన్ని విధాలుగా గౌరవిద్దామని అధి కారులు, హెరిటేజ్ ఇండియా ప్రతినిధులు పిలుపునిచ్చారు. నేటి యువతరం తల్లిదం డ్రులను, వృద్ధులను గౌరవించి నడుచుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. వృద్ధుల సంక్షేమం, సంరక్షణ కోసం వచ్చిన చట్టం ఆవశ్యకతను అందరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో బుధ వారం జరిగిన వన్ డే వర్క్ షాప్ లో హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు భాగ స్వామ్యమయ్యారు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల పోషణ %ు% సంక్షేమ చట్టం - 2007పై సుదీర్ఘంగా చర్చించారు. అమలు విషయంలో అనుసరించాల్సిన విధానాలపై అవగాహన పెంచుకున్నారు. సదస్సులో భాగంగా హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులైన సీనియర్ జర్నలిస్టు చదలవాడ ప్రసాద్, అడ్వకేట్ కొంగారపు గణపతిలు పలు విషయాలపై అధికారులకు అవగాహన కల్పించారు. వృద్ధులకు అన్ని విధాలుగా సహకరించాలని, కొన్ని ప్రత్యేక అవసరాల్లో ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. కార్యాలయాలు, ఆసుపత్రులు, పోలీసు స్టేషన్లలో వారికి సులభంగా సేవలందించాలని చెప్పారు. చట్టం అమలు విషయానికి వస్తే ఆర్డీవోలు ట్రిబ్యునల్ అధికారిగా వ్యవహరిస్తారని, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మెంబర్ కన్వీనర్ గా ఉంటారని చెప్పారు. 60 రోజుల్లో సంబంధిత సమస్య పరిష్కారం కాని సమయంలో ఫిర్యాదుదారు అప్పీలేట్ ట్రిబ్యునల్ అయిన జిల్లా కలెక్టర్ ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సివిల్ కోర్టుల పరిధిలో ఉన్న ఫిర్యాదుల విషయంలో ట్రిబ్యునల్ అధికారి జోక్యం చేసుకోరాదని స్పష్టం చేశారు. రాయితీపై వైద్య సహాయం అందించాల్సి ఉందని, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సేవలను అందించాలని హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించేలా 150 మందికి సరిపడే విధంగా వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా 80 ఏళ్ల వయసు దాటిన వృద్ధులకు ప్రభుత్వం రూ.5 లక్షల వరకు బీమా కల్పిస్తుందని, దీనిపై అవగాహన కల్పించి సహకారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులను, వృద్ధులను సరిగ్గా చూసుకోకపోతే సంబంధిత వారసుల ఆస్తి హక్కు కూడా ఆటోమేటిక్ గా రద్దవుతుం దని స్పష్టం చేశారు. గిఫ్ట్ డీడ్ విషయంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించి ముందుకెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వృద్ధుల కోసం కేజీహెచ్ లో సాయంత్రం పూట ప్రత్యేక ఓపీ వయో వృద్ధుల సౌకర్యార్థం కేజీహెచ్ లో సాయంత్రం 4.00 నుంచి 6.00 గంటల వరకు ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నట్లు కేజీహెచ్ ఆర్ఎంవో బంగారయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. అలాగే కొంతమంది గుర్తు తెలియని వృద్ధులు, భిక్షాటన చేసుకునే వారు అనారోగ్యంతో వస్తే వారి కోసం ప్రత్యేక సేవా వార్డు ద్వారా సేవలందిస్తున్నట్లు తెలిపారు. వీరికి సేవలను మరింత విస్తృతం చేసేందుకు గాను యంత్రాంగం నుంచి సహకారం కావాలని, ప్రత్యేక సహాయకులను కేటాయించాలని ప్రస్తావించారు.టైం బ్యాంక్ లో అందరూ స్వచ్ఛందంగా చేరాలి వయో వృద్ధులకు ఆసరాగా నిలిచేందుకు గాను పైలట్ జిల్లా విశాఖపట్టణంలో అమలు చేస్తున్న టైం బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అందరూ స్వచ్ఛందంగా చేరాలని నిర్వాహకులు కోరారు. తగిన విధంగా తోడ్పాటు అందించాలన్నారు. టైం బ్యాంక్ విధానం దేశంలో 2019లో ప్రారంభమయ్యిం దని, చాలా నగరాల్లో అమలవుతుందని ప్రతినిధులు తెలిపారు. విశాఖపట్టణంలో 12 పిన్ కోడ్ లాగిన్ ఏరియాల్లో అమలవుతుందని వివరించారు. ఇందులో ఆర్థిక లావాదేవీలు ఉండవని, పరస్పర సహకారం మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా చేరొచ్చని వివరాలకు ఫోన్ 9440301311 నెంబర్ను సంప్రదించవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాలు, సీనీయర్ సిజిజన్ల సంక్షేమ శాఖ ఏడీ కవిత, భీమిలి ఆర్డీవో సంగీత్ మా థుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు సత్తిబాబు, మాధవి, సత్యపద్మ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ పరిశీలించిన పీఓ..



**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, జూలై 30 :** పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా డ్రోన్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్ట్ గా పాచిపెంట మండలం కొత్తవలసలో డ్రోన్ ద్వారా చేపట్టిన యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాన్ని పీఓ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వ్యాప్తితో మలేరియా, డెంగ్యూ, చికిన్ గున్యా వంటివి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ ను గిరిజన ప్రాంతమంతా విస్తరించాలని అన్నారు. తదుపరి సాలూరు మండలం పోతన్నవలసలోని వసతి గృహాన్ని సందర్శించి, అక్కడ చేపట్టిన మలేరియా నివారణ స్ప్రే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం తోనాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు జారీచేశారు. ఈ పర్యటన లో డీఎంహెచ్ఓ డా. ఎస్.భాస్కరరావు,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీరు.రహదారి, కల్పించాలి.




బాలేసు గూడా గ్రామస్తులు. డిమాండ్.



**గుమ్మలక్ష్మీపురం జూలై 30.పెన్ పవర్.** లోవముఠా ప్రాంతంలో త్రాగునీరు సరైన రహదారి లేక కొన్ని గ్రామాలు ఇబ్బందులు గురవుతున్నారు.ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఆ సమస్యలు పరిష్కరించినప్పటికీ కొన్ని గ్రామాలు మాత్రం ఇంకా అలానే ఉన్నాయి.అందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు పంచాయితీ.బాలేసు గూడ గ్రామంలో త్రాగునీరు.సరైన రహదారి లేక ఆ గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం నాడు విలేకరులతో బాలేసు గూడ గ్రామస్తులు మాట్లాడుతూ.ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మా గ్రామం లో జ్వరాలు తీవ్రత ఎక్కువగా ఉన్నాయి.ఆ పరిస్థితుల్లో కూడా అంబులెన్స్ రావడానికి సరైన రహదారి లేక.అత్యవసరమైతే ఆ పేషెంట్ ను డోలిమొత్తల్లో తీసుకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు పత్రికా విలేకరులతో అన్నారు. అలాగే కొన్ని సంవత్సరాలుగా త్రాగునీరు సమస్య కూడా ఉందని మా గ్రామస్తులమంతా ఊట బావి నీటిని త్రాగుతున్నాము,ఆ బావి వర్షాకాలంలో పూర్తిగా కలుషితమైన బురద నీటితో ఉంటుంది అయినా తప్పని పరిస్థితుల్లో ఆ నీటిని త్రాగుతున్నామ.వేసవికాలంలో అయితే పూర్తిగా అడుగంటి పోతుందని. ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయంపై సంబంధిత అధికారులకు పలుమార్లు మా గ్రామస్తులము విన్నపించుకున్నాము కానీ దానికి ఇప్పటికీ శూన్యంగా మిగిలింది అని ఆ గ్రామస్తులు అన్నారు.ఇప్పటికైనా మా సమస్యను అర్థం చేసుకొని స్థానిక ఎమ్మెల్యే తోయికి జగదీశ్వరి మేడం. మరియు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరిస్తారని మీడియా ద్వారా కోరుతున్నామని గ్రామస్తులు అన్నారు.

## చెక్ పోస్ట్ వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించిన సీఐ



**గుమ్మలక్ష్మీపురం జులై 30 పెన్ పవర్.**

మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా ఎల్విన్ పేట చెక్ పోస్ట్ వద్ద సీఐ హరి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు. ఈ సందర్భంగా సిఐ హరి మాట్లాడుతూ.ఆంధ్ర ఒడిశా సరిహద్దు కావడంతో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని సీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదాని స్మార్ట్ మీటర్లు మాకు వద్దు




**పద్మనాభం, పెన్ పవర్, జులై 30** :ఆదాని విద్యుత్ మీటర్ల నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని! సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో పద్మనాభం లో సంత బయలు ప్రాంతంలో ఆదాని స్మార్ట్ మీటర్లను మీ ఇంటికి బిగించకుండా అడ్డుకోవాలని సిపిఎం పార్టీ ఇంటింటికి ప్రచారం బుధవారం చేస్తూ కరపత్రాలు పంచుతూ స్టిక్కర్లు అంటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తు! ఈ సందర్భంగా సిపిఎం పార్టీ భీమిలి జోన సహాయ కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ ఆదాన్ని స్మార్ట్ మీటర్ల వల్ల ప్రతి ఇంటికి 9600 నుండి 12000 వరకు భారం పడుతుందని! 96 నెలలు మన కరెంట్ బిల్లులో కట్ చేసుకుంటా రని! రిమోట్ సిస్టంతో కరెంటు ఆన్ అండ్ ఆఫ్ అవుతుందని! భవిష్యత్తులో కరెంటు రాత్రికొక రేటు పగలు ఒక రేటు ఉంటుందని! కరెంట్ బిల్లు కట్టడం మనకి తలకు మించిన భారం అవుతుందని! ఇప్పటికే నిత్యవసర ధరలు గ్యాస్ పెట్రోలు విద్య వైద్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని! ఈ మీటర్లు బిగిస్తే మనకి మరింత భారం అవుతుందని! ప్రతి ఒక్కరూ ఆదాని మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం పార్టీ పిలుపునిస్తుంది.

ఈ కార్యక్రమంలో కే సీతాదేవి నాయకులు పంపాను సూర్యనారాయణ, ములపర్తి అప్పారావు సింగిడి రాము ఎం. రవణ పొగరు అప్పారావు చిన్న పద్దు పెద్ద పద్దు! తదితరు ప్రజలు కార్మికులు పాల్గొన్నారు.

## జీకే వీధిలో వైసీపీ నాయకుల సమావేశం
## నేడు-భవిష్య కార్యాచరణపై చర్చ

**మండల కమిటీ సభ్యులకు పరిచయ కార్యక్రమం**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 31**:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జీకే వీధి మండల కేంద్రంలో నేడు (31-07-2025) ముఖ్య సమావేశం జరగనుంది. మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది అని వైసిపి మండల అధ్యక్షులు కంకిపాడు గిరిప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో ఇటీవల మండల కమిటీకి నూతనంగా నియమితులైన సభ్యుల పరిచయం కార్యక్రమం నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా పార్టీ భవిష్య కార్యాచరణపై, ముఖ్యంగా గ్రామ/పంచాయతీ కమిటీల ఏర్పాటు, “బాబు షూరిటీ - మోసం గ్యారంటీ” అనే అంశంపై సమగ్ర చర్చ జరగనుంది.ఈ సమావేశానికి మండలంలోని వైసీపీ శ్రేణులు, గ్రామ, పంచాయతీ స్థాయి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జిల్లా స్థాయి అనుబంధ సంఘాల నాయకులు తప్పకుండా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మండల వైసీపీ అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బోయిన కుమారి, వైస్ ఎం.పి.పి. లోతా దేముడు లు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

## వైసిపి గ్రామపంచాయతీ కమిటీలు ఏర్పాటు.



**అనంతగిరి జూలై 30 పెన్ పవర్.** అరకులోయ నియోజకవర్గం,అనంతగిరి మండలంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాలతో 24 గ్రామ పంచాయతీలలో గ్రామ కమిటీల ఏర్పాటును శరవేగంగా చేపడుతున్నట్లు వైసీపీ అనంతగిరి మండల పార్టీ అధ్యక్షులు కొర్రా సూర్యనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 24 గ్రామ పంచాయతీలలో ఇప్పటి వరకు 19 పంచాయతీలలో గ్రామ పంచాయతీ కమిటీ ఏకగ్రీవ ఎన్నికలు జరిగినట్లు తెలిపారు.అందులో భాగంగా కోనాపురం,బొర్ర,అనంతగిరి,ఎగువ శోభ పంచాయతీలలో గ్రామ పంచాయతీ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపీపీ శెట్టి నిలవేణి ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ విధివిధానాలను నూతన కమిటీ సభ్యులకు వివరించారు.అదే విధంగా బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో నిర్వహించి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అరాచక పాలన పై గ్రామస్తులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దూరు గంగన్న దొర.ప్రధాన కార్యదర్శి డేనియల్.సర్పంచ్ లు గుబయి అప్పలమ్మ,కొర్రా సింహాద్రి, సన్యాసిరావు,జే సి ఎస్ కన్వీనర్ నవీన్,వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మండల అధ్యక్షులు శెట్టి ఆనంద్ రఘునాథ్. తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా
## మచ్చల మంగతల్లి ప్రమాణ స్వీకారం




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జులై 30:** పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బీజేపీ నేత మచ్చల మంగతల్లి బుధవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నుంచి పాంగి శివాజీ సహా ఇతర కూటమి సభ్యులు కూడా కమిటీ మెంబర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్. గంగులయ్య మాట్లాడుతూ, “గిరిజన ప్రాంతాల్లో అనేక వాణిజ్య పంటలు, మిల్లెట్లు, అపరాలు సేంద్రియంగా పండిస్తున్న రైతులకు మద్దతు ధర, శీతల గిడ్డంగులు, మార్కెట్ సదుపాయాలు వంటి అంశాల్లో కృషి చేయడం అవసరం” అని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా గిరిజన రైతులకు ఆర్థికంగా మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మచ్చల మంగతల్లితో పాటు తెదేపా నుంచి ఎన్నికైన సభ్యులు, జనసేన పార్టీ నుంచి మెంబర్‌గా ప్రమాణం చేసిన పాంగి శివాజీని జనసేన నాయకత్వం అభినందించింది. కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు, జనసేన జిల్లా ఉపాధ్యక్షురాలు కిట్లంగి పద్మ, అధికార ప్రతినిధి బొంకులా దివ్యాలత, పాడేరు పట్టణ అధ్యక్షులు మజ్జి నాగేష్, వంపూరు సురేష్, సలేబు అశోక్, మజ్జి సత్యనారాయణ, దేవేంద్ర ప్రసాద్, లంకేలా పవన్, %ూాాజూ% మెంబర్ వంపూరు రమేష్, భాను ప్రసాద్ తదితరులు తమ హాజరుతో వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బీజేపీ, తెదేపా నేతలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్ లో రాత్రి భోజనాలను పరిశీలన

● జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జోనల్ కమిషనర్ శివప్రసాద్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్,జూలై 30 :** అన్నా క్యాంటీన్ల లో పరిశుభ్రమైన రుచికరరం తో కూడిన భోజనాన్ని ప్రజలకు అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన జీవీఎం సీ జోన్ 3 పరిధిలోగల ఎంవిపి కాలనీ అన్న క్యాంటీన్లో రాత్రి భోజనాలను, సదుపాయాలను, పరిశుభ్రతను జోనల్ కమిషనర్ శివప్రసాద్ తో కలిసి పరిశీలించారు . ఈ పరిశీలనలో కమిషనర్ ముందుగా ఎంవిపి అన్నా క్యాంటీన్లో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం రుచిని పరిశుభ్రతను వేడిగా అందుతుందా లేదా అని అడుగగా విద్యార్థులు స్పందిస్తూ పరిశుభ్రమైన భోజనం అందుతుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం క్యాంటీన్ లో భోజనం వడ్డిస్తున్న విధానాన్ని, భోజనం టోకెన్లను ఇస్తున్న పద్ధతిని పరిశీలించారు, క్యాంటీన్ అంతా కలియ తిరిగి పరిసరాలు పరిశుభ్రత, త్రాగునీరు, మరుగుదొడ్లు పరిశుభ్రతను పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడుతూ రోజు తయారు చేస్తున్న ఆహార పదార్థాల వివరాల ను, ఎన్ని గంటలకి క్యాంటీన్ ప్రారంభిస్తున్నారు అని ఆరా తీస్తూ మన ఇంటిలో భోజనం వడ్డించే మాదిరిగా అన్నా క్యాంటీన్లో కూడా ఆహారం తీసుకుంటున్న వారికి సహనంతో రుచికరమైన ఆహారాన్ని అందించా లని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం టిటిడి కూడలి వద్ద వీధిలైట్ల పనితీరును, సిసిఎంఎస్ బాక్సులను పరిశీలించారు . వీధిలైట్ల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం సమీపంలోనున్న చికెన్ షాప్ వద్ద మాంసాన్ని పరిశీలించి రోజుకు ఎంత మాంసం అమ్ముడు అవుతుంది? వాటి వ్యర్థాలను ఎలా తరలిస్తున్నారన్న వివరాలను ఆరా తీశారు. సమీపంలో ఉన్న వ్యాపారస్తులు వద్ద తప్పనిసరిగా డస్ట్ బిన్ లు ఉండాలని , వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడవేయ కుండా డస్ట్ బిన్ ల లో మాత్రమే వేయాలని కొనుగోలుదారులకు కూడా అవగాహన కల్పించాలని వారికి కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధర్, సహాయక వైద్యాధికారి బి.ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మంగాతల్లిని సన్మానించిన బీజేపీ నాయకులు




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ జులై 30:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మార్కెట్ యార్డు కమిటీ నూతన ఛైర్మన్‌గా బీజేపీ నాయకురాలు మచ్చల మంగాతల్లి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గూడెం కొత్త వీధి మండలంలోని బీజేపీ నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు ఆమెకు దుస్సాలు కప్పి, శాలువాతో సత్కరించారు.ఈ సన్మాన కార్యక్రమానికి పాడేరు టీడీపీ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వంపురి గంగులయ్య పాల్గొన్నారు. అదేవిధంగా గూడెం కొత్త వీధికి చెందిన బీజేపీ ఎంపీటీసీ మరియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షురాలు రీమల రాజేశ్వరి, మండల బీజేపీ అధ్యక్షుడు కాకురు శేఖర్, జిల్లా నాయకులు ఎం. రామ్ కిరణ్ కుమార్, రీమల పాల్, అల్లూరి జిల్లా ఐటీ కన్వీనర్ పండ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి చల్లంగి అత్యుత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మచ్చల మంగాతల్లి నాయకత్వంలో పాడేరు మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి చెందుతుందని, రైతులకు అనుకూలంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కేజీబీవీను సందర్శించిన సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్



**గుమ్మలక్ష్మీపురం జులై 30. పెన్ పవర్.** మండలంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం నాడు సర్పంచ్ గౌరీ శంకర్ సందర్శించి విద్యార్థులతో ముఖాముఖీ చర్చ నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్ మాట్లాడుతూ. విద్యార్థినుల సమస్యలు,వారి అవసరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని ప్రస్తుతం పాఠశాలలో 283 మంది విద్యార్థినులు చదువుతున్నారు.అయితే,వారికై కేవలం 15 మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో,మరిన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారని ఆయన అన్నారు.అలాగే ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టు గతం నుండి ఖాళీగా ఉందని విద్యార్థులు తెలియజేయాగ.దీనిపై ప్రిన్సిపాల్ రంజని ను ప్రశ్నించగా,ఆ పోస్టు మంజూరైందని ఇంకా వీధిలోకి రాలేదని తెలిపారు.ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్,సెకండ్ ఇయర్ విద్యార్థినిలు ఒకే గదిలో ఉండటంతో చదువుకు అంతరాయం ఏర్పడుతోందని విద్యార్థులు వారితో విన్నవించారని.అన్నారు.

విద్యకు పెద్దపీట వేస్తూ గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో "నాడు-నేడు" పథకంలో మంజూరైన కొత్త భవనం ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో,మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులపై ప్రభావం చూపుతున్నది.హిస్టరీ గెస్ట్ లెక్చరర్ పోస్ట్ కూడా పూర్తిగా మంజూరు కాలేదని. అలాగే

వంటశాల,ఆహార పదార్థాలు వడ్డించే ప్రాంతమంతా కూడా సరిగ్గా లేదని.వంటశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. పాఠశాల రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త మొక్కలను గ్రామపంచాయతీ సహకారంతో తొలగించడం జరిగిందని.విద్యార్థుల భవిష్యత్తు మెరుగ్గా ఉండాలి అంటే,ప్రభుత్వమే బాధ్యతగా మౌలిక సదుపాయాలను సమృద్ధిగా కల్పించాలి. విద్యను అందని ద్రాక్షలా మారనీయకుండా,వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సర్పంచ్ అన్నారు. సర్పంచ్, గుమ్మలక్ష్మీపురం

## ఎన్ఏడి ఫ్లైఓవర్ పనులు పరిశీలించిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు





**ఎన్ఏడి, పెన్ పవర్, జూలై 30 :** జీవీఎంసీ 90వ వార్డు, ఎన్ఏడి కొత్త రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు. గత కొంతకాలంగా ఎన్ఏడి లో జరుగుతున్న ఆర్ఓబి పనుల నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో ఎమ్మెల్యే గణబాబుతో వివిఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఉన్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఎన్ఏడి ఫ్లైఓవర్ ఆర్ఓబి పనులను శరవేగంగా జరుగుతున్నాయని, తొరగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

## 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదని తెలియజేయాలన్నారు.



జిల్లా కలెక్టరు హరేంధిర ప్రసాద్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం జులై 30 :** అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ చేసుకోవ దానికి ముందుకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టరు హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుండి రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెంబర్ 30, 45, 27(యు.ఎల్. సి) లకు లోబడి నిరభ్యం తకర భూముల్లో 2019, 10వ తేదీ కంటే ముందు భూమిని ఆక్రమించుకుని ఆర్సీసీ స్లాబ్ లేదా రేకులతో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉండేవారు మీసేవ, గ్రామ, వార్డు సచివాలయం ద్వారా ఈ ఏడాది డిసెంబరు 31లోగా రెగ్యుల రైజ్ చేసుకోవడానికి ఆధారాలతో దరఖాస్తు చేసుకొనే విధంగా అవగాహన కల్పించాలని, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులకు కన్వియన్స్ డీడ్ లను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గుడిసెలు, తాటాకు పూరిళ్లకు ఇది వర్తిసుందని. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామని. కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తామని మరియు 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదని తెలియజేయాలన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాలలోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని వివరించాలన్నారు. ఇదే విభాగంలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టవలసి ఉంటుందని. 450 గజాలకు మించి ఆక్రమణలలో ఉన్నవారు బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుందని తెలియజేసి పూర్తి అవగాహన కల్పించడం ద్వారా రెగ్యులరైజ్ చేసుకునేందుకు ముందుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(పి జి ఆర్ ఎస్)లలో వచ్చిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేకశద్ధవహించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. అర్జీలను పూర్తిగా పరిశీలించి, అర్థంచేసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. తహశీల్దార్లు ప్రతిరోజు మొదటిపనిగా తమ కార్యాలయానికి వచ్చిన అర్జీలను పరిశిలించాలని, పిర్యాదుదారునితో నేరుగా మాట్లాడాలని, అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. తహశీల్దారు పంపిన రిపోర్టు ఏ స్థాయిలోను వ్యతిరేకించలేని విధంగా వాస్తవాలతో సమాధానం తెలపాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన పిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి భూమిని ఖాళీ చేయించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన విఆర్ఓల పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, విశాఖపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీలేఖ, భీమిలి రెవెన్యూ డివిజన్ అధికారి సందీప్ మాధుర్, జిల్లా రెవిన్యూ అధికారి బి.హెచ్.భవాని శంకర్, సర్వే శాఖ సహాయ సంచాలకులు సూర్యారావు, మండల రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ సూపరిండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, జూలై 30 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## సోషల్ మీడియా పోస్టులు పెట్టుటలో విజ్ఞతతో వ్యవహరించాలని సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు



● విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్,విజయనగరం, జులై 30 :** సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా అనుచితమైన పోస్టులు పెట్టి కుల, మత, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిపైన, వారిని ప్రోత్సహించే వారిపై నా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూలై 30నహెచ్చరించారు.

సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వాస్తవాలను వక్రీకరిస్తూ మతాలను, కులాలను, రాజకీయ పార్టీలను రెచ్చగొడుతూ వ్యక్తిత్వ హననంకు పాల్పడుతూ ట్విట్టరు, ఫేస్ బుక్, ఇనస్టాగ్రాం, యూట్యూబు, టెలిగ్రాం, వాట్సాప్, లింకిడిన్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ లో ఎవరికి తోచిన విధంగా వారు పోస్టులు పెట్టి మతాలు, కులాల, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొడు తూ, వ్యక్తిత్వ హననంకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా నిఘా పెట్టిందన్నారు. ఇందుకుగాను ఒక పోలీసు బృందాన్ని ప్రత్యేకంగా నియమించి, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.డెంకాడ మండలం టి.కల్లాలు (చిన మోపాడ) లోగల క్రైస్తవ చర్చి ఆవరణంలోగల యేసు క్రీస్తు విగ్రహంపై ఒక చెట్టు కొమ్మ పడిపో వడం వలన విగ్రహం పాడైపోతే, వాస్తవం తెలుసుకోకుండా గోపీనాథం సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు నాడిశెట్టి శాంతారావు అనే వ్యక్తి సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టు పెట్టడంతో అతడిపై డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి, విచార ణ చేపట్టి, అరెస్టు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.ప్రజలు సోషల్ మీడియా ప్లాట్ఫారమ్స్ అయిన ట్విట్టరు, యూట్యూబు, వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రాం, టెలిగ్రాం, లింర్డిన్ వంటి సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నవారు విజ్ఞతతో వ్యవహరించా లన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టేటపుడు ఇతరుల మతాలు, కులాలు, మనోభావాలకు, వ్యక్తిత్వానికి భంగం కలిగించకుండా ఉండాల న్నారు. పోస్టుల్లో వాస్తవాలను వక్రీకరించడం, వాస్తవాలు తెలుసుకోకుండా పోస్టులు చేయడం వలన ఇతరుల మనోభావాలు దెబ్బతింటా యన్న వాస్తవాన్ని ప్రతీఒక్కరూ గమనించాల న్నారు.యువత, ప్రజలు సోషల్ మీడియాను పాజిటివ్ కోణంలో వినియోగించుకొని, సాంకేతి కతను అందిపుచ్చుకొని,నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉన్నామని ఇతరు లచే గుర్తింపుకు విద్వేషాలు రెచ్చగొడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ నెటిజనులను హెచ్చరించారు.

## వైయస్ జగన్ పర్యటనకు రాకూడదు

**నెల్లూరు జిల్లా వైయస్ఆర్‌సీపీ నేతలకు పోలీసుల నోటీసులు**

**నెల్లూరు: పెన్ పవర్, జూలై 30 :** వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ నెల్లూరు పర్యటన వేళ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంక్షల విధింపు కనిపిస్తోంది. వైయస్ జగన్ పర్యటన హైలైట్ కావొద్దని టీడీపీ కుట్రలు చేస్తోంది. ఇప్పటికే వైయస్ఆర్‌సీపీ నేతలకు, కార్యకర్తలకు పోలీసులతో బెదిరింపులు తెర లేపారు. జనసమీకరణ జరగొద్దని మైకులతో ప్రచారం చేయిస్తోంది. పోలీస్ సెక్షన్ 30 అమల్లో ఉందని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిస్తోంది. ఇప్పటికే జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లా నేతలకూ పోలీస్ నోటీసులు జారీ అయ్యాయి. ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకులకు నోటీసులు చేరాయి. తాజాగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డిలకు పోలీసులు నోటీసులు అందజేశారు. వైయస్ జగన్ పర్యటనకు రాకూడదంటూ అందులో పేర్కొన్నారు. అదే సమయంలో.. కేసులు పెడతామంటూ కార్యకర్త స్థాయి వాళ్లకూ పోలీసు బెదిరింపులు వెళ్తుండడం గమనార్హం.

మాజీ మంత్రి కాకాణితో ములాఖత్‌తో పాటు టీడీపీ గుండాల చేతిలో తృటిలో దాడి నుంచి తప్పించుకున్న నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని వైయస్ జగన్ పరామర్శించాల్సి ఉంది. సాధారణంగానే.. వైయస్ జగన్ వస్తున్నారంటే జనం తండోపతండాలుగా తరలి వస్తారు. అందునా కూటమి ప్రభుత్వ వ్యతిరేకత అనేది వైయస్ జగన్ పర్యటన రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే ఆయన పర్యటనలకు జనాన్ని దూరం చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు.

ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకులకు నోటీసులు చేరాయి. తాజాగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డిలకు పోలీసులు నోటీసులు అందజేశారు. వైయస్ జగన్ పర్యటనకు రాకూడదంటూ అందులో పేర్కొన్నారు

# తమిళనాట విజయ్ "గెలుపు" ఆత్మవిశ్వాసం ఫలిస్తుందా?




**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళ సినీ రంగంలో అగ్రతారగా వెలుగొందుతున్న విజయ్, తన రాజకీయ పార్టీ టీవీకే (తమిళగ వెల్లాత్తల కజగం)తో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ప్రకటించడం తమిళనాట చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రకటన కేవలం ఒక ఆశ కాదని, ప్రజల ఆకాంక్ష అని విజయ్ బలంగా నమ్ముతున్నారు. ఇంతటి ఆత్మవిశ్వాసానికి దారితీసిన అంశాలను లోతుగా పరిశీలిద్దాం.

**చరిత్ర పునరావృతమవుతుందా?**

విజయ్ తన వాదనకు బలం చేకూర్చేందుకు గతంలోని ఉదాహరణలను ప్రస్తావించారు. 1967, 1977 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త పార్టీలు అధికార పార్టీలను ఓడించిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. ఈ వాదనలో కొంత నిజం లేకపోలేదు. తమిళనాడు రాజకీయ చరిత్రలో ప్రజలు కొత్త నాయకత్వాన్ని, కొత్త సిద్ధాంతాలను ఆదరించిన సందర్భాలు ఉన్నాయి. అన్నాదురై, ఎం.జి.ఆర్. వంటి నాయకులు ద్రవిడ ఉద్యమ నేపథ్యంతో రాజకీయాల్లోకి వచ్చి అద్భుత విజయాలు సాధించారు. అయితే ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులు నేటితో పూర్తిగా వేరు. అప్పుడు ద్రవిడ ఉద్యమం బలంగా ఉండి, ప్రాంతీయ ఆత్మగౌరవం అనే భావన బలంగా ఉండేది. నేడు రాజకీయ స్పృహ పెరిగి, సమస్యలు మరింత సంక్లిష్టంగా మారాయి.

**ప్రజల ఆశయం VS విజయ్ అభిప్రాయం**

"ఇది కేవలం నా అభిప్రాయం కాదు, ఇదే ప్రజల ఆశయం" అని విజయ్ చెప్పడం అతని రాజకీయ వ్యూహంలో ఒక భాగం. సినీ తారగా విజయ్ కు ఉన్న ప్రజాదరణ, అభిమాన బలం అపారం. తమిళనాడులో అభిమానులు తమ నాయకులను దైవంగా భావించే సంస్కృతి ఉంది. ఈ అభిమాన బలాన్ని ఓట్లుగా మలచుకోవాలనేది విజయ్ ప్రధాన లక్ష్యం. అయితే, అభిమానం ఓటుగా మారడానికి చాలా అంశాలు ప్రభావితం చేస్తాయి. కేవలం సినీ గ్లామర్ తో ఎన్నికల్లో గెలిచిన సందర్భాలు చాలా తక్కువ. ప్రజలు తమ నిజ జీవిత సమస్యలకు పరిష్కారాలను కోరుకుంటారు, కేవలం స్టార్ డంను కాదు.

**అన్నాదురై అడుగుజాడల్లో**

అన్నాదురై రాజకీయ సిద్ధాంతాలను ప్రస్తావిస్తూ, ప్రజలతో సన్నిహితంగా మమేకమై వారి అవసరాలపై దృష్టి సారిస్తామని విజయ్ చెప్పడం సానుకూల పరిణామం. అన్నాదురై ప్రజా సమస్యలపై దృష్టి సారించి, వారి ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేశారు. ఆయన ప్రజల మనిషిగా పేరు పొందారు. విజయ్ కూడా అదే మార్గంలో నడవాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే అన్నాదురై కు ఉన్న సైద్ధాంతిక బలం, దశాబ్దాల రాజకీయ అనుభవం విజయ్ కు లేవు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడానికి అన్నాదురై అనుసరించిన శైలిని, నిబద్ధతను విజయ్ ఎంతమేరకు ప్రదర్శిస్తాడన్నది ప్రశ్నార్థకం.

**సాంకేతికతతో ప్రజా మద్దతు:**

"%వీఎ ుఎఖ%" యాప్ ను ప్రారంభించడం విజయ్ ఆధునిక దృక్పథాన్ని సూచిస్తుంది. ఈ యాప్ ద్వారా కార్యకర్తలు ప్రజలతో నేరుగా సంబంధం ఏర్పరచుకుని, పార్టీ ఆలోచనలను ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకుపోవచ్చని విజయ్ భావిస్తున్నారు. ఈ డిజిటల్ వ్యూహం నేటి కాలంలో చాలా ముఖ్యం. ఇది పార్టీకి తక్కువ సమయంలో విస్తృత ప్రచారం కల్పించడంలో సహాయపడుతుంది. అయితే, కేవలం సాంకేతికతతో ఓట్లను రాబట్టడం కష్టం. యాప్ ద్వారా ప్రజలతో సంభాషించడం ఒక ఎత్తైతే, వారి సమస్యలను అర్థం చేసుకుని వాటికి పరిష్కారాలను చూపడం మరో ఎత్తు.

**ఉద్యమంగా రాజకీయాలు**

"ఇది కేవలం ఎన్నికల కోసం చేసే ప్రచారం కాదే, ఇది ప్రజల మధ్యకి వెళ్లే ఉద్యమం" అని విజయ్ స్పష్టం చేశారు. ఈ ప్రకటన విజయ్ రాజకీయ రంగ ప్రవేశాన్ని సీరియస్ గా తీసుకుంటున్నారని, కేవలం ఎన్నికల వరకు మాత్రమే కాకుండా, దీర్ఘకాలికంగా ప్రజల్లో పనిచేయాలని ఆయన కోరుకుంటున్నారని తెలియజేస్తుంది. ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తేనే ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవచ్చని విజయ్ విశ్వసిస్తున్నట్లున్నారు. ఇది మంచి సూచన.

విజయ్ రాజకీయ రంగ ప్రవేశం తమిళనాట ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆయనకున్న స్టార్ డం, అభిమాన బలం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రజల్లోకి వెళ్లే ప్రణాళికలు సానుకూలంగానే కనిపిస్తున్నాయి. అయితే, రాజకీయాల్లో గెలుపు అనేది కేవలం వీటిపైనే ఆధారపడదు. బలమైన సిద్ధాంతాలు, స్పష్టమైన విధానాలు, ప్రజా సమస్యలపై నిబద్ధత, నాయకత్వ లక్షణాలు, పార్టీలోని క్రమశిక్షణ వంటి అనేక అంశాలు గెలుపును ప్రభావితం చేస్తాయి. గత అనుభవాలను పునరావృతం చేస్తానని విజయ్ చెబుతున్నా, నేటి రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారాయి. ఆయన ప్రజల నమ్మకాన్ని ఎంతమేరకు గెలుచుకుంటాడు, ప్రస్తుత రాజకీయ పార్టీలను ఎలా ఎదుర్కొంటాడు అన్నది 2026 ఎన్నికల్లో తేలుతుంది. "ఆత్మవిశ్వాసం" అనేది మంచిదే అయినా, "ఆచరణ"లో అది ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

# నిద్ర లక్షణాలు, వ్యాధుల మధ్య సంబంధం?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆరోగ్యం, నిద్ర మధ్య ఉన్న సంబంధంపై జరుగుతున్న పరిశోధనల్లో ఓ కొత్త అధ్యయనం కీలక విషయాలను వెల్లడించింది. యాంత్రికంగా కొలిచిన నిద్ర లక్షణాలు అనేక వ్యాధులతో ఎలా సంబంధం కలిగి ఉన్నాయో ఈ పరిశోధన స్పష్టంగా చూపింది. యూకే బయోబ్యాంక్ ప్రాజెక్ట్‌లో భాగంగా 88,461 మంది పాల్గొన్న వారి నుంచి సేకరించిన డేటాతో నిద్ర వ్యవధి, ప్రారంభ సమయం, నిద్ర రిథమ్, మగత నిద్ర వంటి లక్షణాలను నిశితంగా విశ్లేషించారు. ఈ అధ్యయనంలో నిద్ర రిథమ్, ముఖ్యంగా రోజువారీ స్థిరత్వం.. రాత్రివేళల చురుకుదనం, విశ్రాంతి మధ్య వ్యత్యాసం (%=వశ్రీఫ్‌అజవ ూఎజూశ్రీఱ్‌బఎవ%) అనే రెండు అంశాలను ప్రధానంగా పరిగణించారు. ఈ నిద్ర లక్షణాలు ఏకంగా 172 వ్యాధులతో సంబంధం కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 42 వ్యాధులకు నిద్ర లక్షణాలు గణనీయంగా ప్రమాదాన్ని రెట్టింపు చేశాయని తేలింది.వృద్ధాప్య సంబంధ వ్యాధి: రిలేటివ్ ఆంప్లిట్యూడ్ తక్కువగా ఉన్నవారిలో ఈ వ్యాధి వచ్చే ప్రమాదం 3.36 రెట్లు ఎక్కువగా ఉంది. గాంగ్రీన్ అనే వ్యాధి ఇంటర్ డైలీ స్టెబిలిటీ తక్కువగా ఉన్నవారిలో హాజర్డ్ రేషియో 2.61గా నమోదైంది. కాలేయ వైఫల్యం వారిని గమనిస్తే.. రాత్రి 12:30 తర్వాత నిద్రపోయే వారిలో ఈ ప్రమాదం 2.57 రెట్లు అధికంగా ఉంది. అంతేకాకుండా పార్కిన్సన్ (37.05%), టైప్ 2 డయాబెటిస్ (36.12%), , మూత్ర సంబంధిత వ్యాధులు (21.85%) వంటి వ్యాధుల్లో 20% పైగా భారం నిద్రకు సంబంధించినదేనని ఈ అధ్యయనం వెల్లడించింది.

**సబ్జెక్టివ్ VS ఆబ్జెక్టివ్ కొలతలు: కీలక వ్యత్యాసాలు**

ముఖ్యంగా గమనించదగిన విషయం ఏమిటంటే, సగం కంటే ఎక్కువ వ్యాధుల సంబంధాలు నిద్ర రిథమ్‌తో మాత్రమే ప్రత్యేకంగా కనిపించాయి. గతంలో వ్యక్తిగత నివేదికల ఆధారంగా చేసిన నిద్ర అధ్యయనాల్లో ఈ విషయం వెలుగులోకి రాలేదు. ఈ కొత్త సంబంధాలను ఎన్ హేన్స్ డేటా సహాయంతో తిరిగి ధృవీకరించారు. అలాగే, గతంలో సబ్జెక్టివ్ నిద్ర డేటాతో చేసిన అధ్యయనాలను తిరిగి విశ్లేషించినప్పుడు కొన్ని ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. కొంతమంది తక్కువ నిద్రపోయే వారు తాము ఎక్కువ నిద్రపోతున్నట్లు చెప్పడం వల్ల, కొన్ని వ్యాధుల విషయంలో తప్పుడు సంబంధాలు కనిపించినట్లు గుర్తించారు. ఉదాహరణకు ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ , డిప్రెషన్ విషయంలో ఇది బలంగా కనిపించింది.

**ఈ అధ్యయనం నుంచి మనం ఏం నేర్చుకోవాలి?**

ఈ నూతన పరిశోధన స్పష్టంగా కొన్ని ముఖ్యమైన విషయాలను తెలియజేసింది. కేవలం నిద్ర వ్యవధి మాత్రమే కాకుండా, నిద్ర ప్రారంభ సమయం, నిద్ర స్థిరత్వం, మరియు నిద్ర వ్యంగతం వంటి అనేక పారామితులు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. వ్యక్తిగత నివేదికల ద్వారా సేకరించిన నిద్ర సమాచారం కంటే, యాంత్రికంగా కొలిచిన కొలతల మధ్య స్పష్టమైన వ్యత్యాసాలు ఉన్నాయి. ఆరోగ్యపరంగా నిజమైన, లోతైన అవగాహన కోసం, వాస్తవిక నిద్ర కొలతలే ఎక్కువ ఉపయోగకరమని ఈ అధ్యయనం సూచిస్తోంది.

**భవిష్యత్ పరిశోధనలకు మార్గనిర్దేశం**

భవిష్యత్తులో నిద్రకు సంబంధించిన పరిశోధనలలో బహుళ-పరిమాణ, ఆబ్జెక్టివ్ కొలతలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ అధ్యయనం గట్టిగా సమర్థిస్తోంది. రోజువారీ నిద్రను నియమితంగా పాటించడం, నిద్ర నాణ్యతను మెరుగుపరచుకోవడం వంటివి ఆరోగ్యాన్ని బలోపేతం చేయగలవని ఇది స్పష్టం చేస్తోంది. మీ నిద్ర అలవాట్లపై శ్రద్ధ వహించడం మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని గుర్తుంచుకోండి.

# ఒక్కసారి కూడా వాడకుండానే
# రూ.5629 కోట్లు షిప్ అమ్మేస్తున్న బిల్ గేట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ పేరు వినగానే ఆవిష్కరణలు, సాంకేతికత, పర్యావరణ స్పృహ గుర్తుకొస్తాయి. అయితే తాజాగా ఆయనకు సంబంధించిన ఓ వార్త అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లిక్విడ్ హైడ్రోజన్‌తో నడిచే ఓ విలాసవంతమైన నౌకను ఆయన విక్రయించడానికి సిద్ధంగా ఉండటం. దీని వెనుక ఉన్న కారణాలు, పర్యావరణానికి సంబంధించిన అంశాలు, ఈ పరిణామం విలాసవంతమైన మార్కెట్‌పై చూపనుంది.

**విలాసవంతమైన నౌక.. వాడకానికి సున్నా!**

ఈ నౌక గురించి వినగానే ఇది మామూలు నౌక కాదని స్పష్టమవుతుంది. 390 అడుగుల పొడవు, ఏడు డెక్కులు, సినిమా థియేటర్, హాట్ టబ్‌లు, లైబ్రరీలు, ప్రైవేట్ ఆసుపత్రి వంటి అత్యున్నత సదుపాయాలతో ఇది సాక్షాత్తూ ఓ తేలియాడే రాజభవనం. నెదర్లాండ్స్‌కు చెందిన ప్రఖ్యాత ఫెడ్‌షిప్ కంపెనీ ఐదు సంవత్సరాల పాటు శ్రమించి దీనిని రూపొందించింది. ఇంతటి భారీ, విలాసవంతమైన నౌకను బిల్‌గేట్స్ ఒక్కసారి కూడా ఉపయోగించకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇది ఆయన వ్యక్తిగత జీవనశైలిలో ఉన్న వ్యత్యాసాన్ని, లేదా బహుశా ప్రాధాన్యతలలో మార్పును సూచిస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

**పర్యావరణ స్పృహ వర్సెస్ వాస్తవం**

ఈ నౌక యొక్క ప్రత్యేకత ఏమిటంటే, ఇది లిక్విడ్ హైడ్రోజన్‌తో నడవడం. సాధారణ డీజిల్ ఆధారిత నౌకల కంటే ఇది గణనీయమైన స్థాయిలో పర్యావరణ హానిని తగ్గిస్తుంది. పర్యావరణ పరిరక్షణకు బిల్ గేట్స్ కట్టుబడి ఉన్నారనడానికి ఇది ఓ నిదర్శనంగా నిలుస్తుంది. అయితే, ఇంతటి అత్యాధునిక, పర్యావరణహిత నౌకను ఆయన ఉపయోగించకపోవడం "గ్రీన్ ఎనర్జీ" వనరుల వినియోగం విషయంలో ఓ లోపాన్ని చూపిస్తున్నట్లు అనిపిస్తుంది. ఒకవైపు పర్యావరణానికి అనుకూలమైన సాంకేతికతను ప్రోత్సహిస్తూనే, మరోవైపు దానిని వ్యక్తిగత వినియోగానికి తీసుకోకపోవడం ఆలోచింపజేసే అంశం.

**వేలం ప్రక్రియ, 'గ్రీన్ లగ్జరీ'కి పెరుగుతున్న డిమాండ్**

ఈ విలాస నౌకను ఈ సెప్టెంబర్‌లో మోనాకోలో జరిగే యాట్ షోలో 645 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 5,629 కోట్లు) విక్రయించనున్నట్లు తెలుస్తోంది. గ్రీన్ ఫర్ లైఫ్ ఎన్విరాన్‌మెంటల్ సంస్థ సీఈఓ పాట్రిక్ డోవిగి దీనిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇది ప్రస్తుతం మార్కెట్‌లో "గ్రీన్ లగ్జరీ" పై పెరుగుతున్న డిమాండ్‌ను స్పష్టంగా సూచిస్తుంది. పర్యావరణ స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో విలాస వస్తువులలో కూడా పర్యావరణ హితమైన ఉత్పత్తులకు ప్రాధాన్యత పెరుగుతోందని ఈ పరిణామం తేటతెల్లం చేస్తుంది.ఫోర్బ్స్ 2025 బిలియనీర్ సూచిక ప్రకారం, బిల్ గేట్స్ ప్రస్తుతం 13వ స్థానంలో ఉన్నారు. 102.2 బిలియన్ డాలర్ల నికర సంపదతో ఆయన ఇప్పటికీ ప్రపంచంలోని అత్యంత ధనవంతులలో ఒకరు. ఈ స్థాయిలో విలాస వస్తువులు లేకపోయినా ఆయనకు ఎటువంటి నష్టం ఉండదనేది స్పష్టం. తన అపార సంపదను దాతృత్వ కార్యక్రమాలకు, సాంకేతిక ఆవిష్కరణలకు, పర్యావరణ పరిరక్షణకు వినియోగించడంపైనే ఆయన ఎక్కువ దృష్టి సారించినట్లు ఈ పరిణామం సూచిస్తుంది.

బిల్‌గేట్స్ వంటి టెక్ దిగ్గజం ఇంతటి విలాస నౌకను ఒక్కసారి కూడా వాడకుండా విక్రయిస్తుండటం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇది ఆయన జీవనవైఖరిలో మార్పు, ఖర్చులపై నియంత్రణ, లేదా విలువలలో పరివర్తనను సూచించవచ్చని భావించవచ్చు. అదే సమయంలో ఇది గ్రీన్ టెక్నాలజీ ఆధారిత నౌకలకు భవిష్యత్తులో పెరుగుతున్న ఆవశ్యకతను కూడా తెలియజేస్తుంది. ఈ వ్యవహారం లగ్జరీ మార్కెట్, గ్రీన్ ఎనర్జీ వాహనాల భవిష్యత్తు వ్యక్తిగత సంపద వినియోగాలపై విస్తృత చర్చకు దారి తీస్తుందనడంలో సందేహం లేదు.

# మిత్రదేశం మిత్రదేశం అంటూ పాతిక శాతం... భారత్ కు ట్రంప్ షాక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మోడీ మంచి స్నేహితుడు.. భారత్ తమకు ఎప్పుడూ మిత్రదేశమే.. భారత్ - అమెరికా మధ్య ఉన్నది గొప్ప బంధం.. ఇలాంటి కబుర్లు ఇంతకాలం చెప్పిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా అనుకున్నంత పని చేశారు. ఇందులో భాగంగా... భారతదేశం ఇకపై 25 శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుందని చావు కబురు చల్లగా చెప్పారు! దీంతో.. ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అవును... ఆగస్టు 1 నుంచి భారతదేశం 25 శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. ఇదే సమయంలో... రష్యా నుంచి ఇంధనం, ఆయుధాలు కొనుగోలు చేసినందుకు అదనపు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని కూడా ట్రంప్ అన్నారు. అదేవిధంగా... అమెరికా వస్తువులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోందని తెలిపారు.

ఈ మేరకు ట్రూత్ సోషల్ మీడియా వేదికగా స్పందించిన ట్రంప్... భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా ఉన్నందున, వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం అని అన్నారు. ఇదే సమయంలో... ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటని.. ఏ దేశంలో లేని విధంగా వాణిజ్యపరంగా అక్కడ అడ్డంకులున్నాయని తెలిపారు.

ఇదే క్రమంలో... రష్యా నుంచి భారీ స్థాయిలో సైనిక ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తోందని.. ఉక్రెయిన్ పై దాడులను ప్రపంచమంతా ఖండిస్తోందని.. అయినా.. భారత్, చైనాలు మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నాయని అన్నారు. అందుకే భారత్ పై ఆగస్టు 1వ తేదీ నుంచి 25% సుంకాలు అదనంగా పెనాల్టీ కూడా విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.కాగా... ఈ నెల మొదట్లో 14 దేశాలకు ట్రంప్ టారిఫ్ లేఖలు రాసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇవి 25% నుంచి మొదలై 40% వరకూ ఉన్నాయి. ఇందులో భాగంగా.. జపాన్, దక్షిణ కొరియాలతో పాటు కజకస్తాన్, మలేషియా, ట్యునీషియాలపై 25% టారిఫ్ విధించిన ట్రంప్... మయన్మార్, లావోస్ లపై అత్యధికంగా 40% విధించారు.ఇదే సమయంలో... దక్షిణాఫ్రికా, బోస్నియాలపై 30%, ఇండోనేషియాపై 32%.. బంగ్లాదేశ్, సెర్బియాలపై 35%.. కంబోడియా, థాయిలాండ్ లపై 36% సుంకాలు విధించారు. ఈ సందర్భంగా... జపాన్, దక్షిణ కొరియాతో పాటు మిగిలిన దేశాలకూ ప్రతీకార సుంకాల గడువును ఆగస్టు 1 వరకూ పొడిగించారు.

# కోట్ల వారి అసంతృప్తి.. కారణాలు చాలానే.. !

**హైదరాబాద్ పెన్ పవర్:** సీనియర్ నేత కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి గత ఏడాది జరిగిన ఎన్నికల్లో డోను నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. టిడిపి టికెట్ పై పోటీ చేసి ఆయన గెలుపు గుర్రం ఎక్కినా.. అసంతృప్తితో ఆయన రగిలిపోతు న్నారు. సీనియర్ నాయకుడిగా తన మాటకు, తనకు విలువ లేకుండా పోతుంది అన్నది కోట్ల ఆవేదనకు కారణంగా తెలుస్తోంది. నియోజకవర్గంలో ఒకప్పుడు ఉన్న డామినేషన్ ఇప్పుడు లేకపోవడం, టిడిపిలో వర్గ పోరు పెరిగిపోయిన నేపథ్యంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఆవేదనతో ఉన్నారు. అదే సమయంలో మంత్రివర్గంలోనూ తనకు చోటు లభించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి బీసీ జనార్దన్ రెడ్డి మంత్రిగా ఉన్న నేపథ్యంలో మరింత మందికి అవకాశం లభించే పరిస్థితి లేకుండా పోయిందని గతంలోనే చంద్రబాబు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డికి వివరించారు. కానీ కోట్ల మాత్రం తన అసంతృప్తిని తగ్గించుకోలేని పరిస్థితిలో ఉన్నారు. స్థానికంగా పట్టు కోల్పోవడం, వచ్చే ఎన్నికల్లో టికెట్ కూడా వచ్చే అవకాశం లేదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో కోట్ల రాజకీయాలు ఒకింత ఆందోళన గానే సాగుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కోట్ల భాగస్వామ్యం ఎక్కడా కనిపించడం లేదు.కనీసం ఆయన బయటకు కూడా రావడం లేదు. అనారోగ్య సమస్యలు ఉన్నాయని అందుకే బయటకు రాలేకపోతున్నాను అని ఆయన చెబుతున్నా.. పార్టీలో మాత్రం అసంతృప్తి కారణంగానే కోట్ల బయటికి రావడం లేదని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. మరోవైపు డోన్ నియోజకవర్గంలో కేఈ ప్రభాకర్ రెడ్డి చక్రం తిప్పుతున్నారు. కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యే అయినప్పటికీ ఆయనకు చెప్పకుండానే ఇక్కడ కార్యక్రమాలు జరుగుతుండడం... అధికారులు సైతం కేఈ చెప్పినట్టు వినడం వంటివి కూడా కోట్లకు మింగుడు పడడం లేదు.పార్టీ అధిష్టానం కూడా పట్టించుకోవడంలేదని తన కేడర్ బలహీన పడుతుందని తరచుగా వ్యాఖ్యానిస్తు న్నారు వచ్చే ఎన్నికల నాటికి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి పోటీ నుంచి తప్పుకుంటారు అనే ప్రయత్నం జోరుగా జరుగుతోంది. పార్టీ పరంగా కూడా వచ్చే ఎన్నికల నాటికి యువనాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశం కనిపిస్తుండడంతో కోట్ల సైలెంట్ కావడానికి ఇది కూడా కారణమని సమాచారం. ఏదేమైనా డోన్ రాజకీయాలు గతానికి భిన్నంగా జరుగుతున్నాయి అన్న ది స్థానికంగా వినిపిస్తున్న మాట. ఒకప్పుడు ఉన్న దూకుడు రాజకీయాలకు ఇప్పుడు కోట్ల దాదాపు దూరంగానే ఉన్నారు.

# పాక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



హైదరాబాద్: పాక్సో కేసులో నాంపల్లి కోర్టు కీలక తీర్పునిచ్చింది. 2022లో జరిగిన మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసును విచారించిన నాంపల్లి కోర్టు నిందితుడికి 20యేళ్ల జైలు శిక్ష విధించింది. బుధవారం (జూలై30) హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన లైంగిక వేధింపుల ఘటనలో పాక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫెన్సెస్) యాక్ట్ కింద కేసు నమోదు చేసిన అంబర్‌పేట్ పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నాంపల్లి కోర్టులోని 12వ అడిషనల్ సెషన్స్ జడ్జి తీర్పు వెలువరిస్తూ..నిందితుడు సలిమెడ వంశీకి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. అదనంగా బాధిత బాలికకు 2 లక్షల రూపాయల పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది.

# నాగార్జున సాగర్‌కు జలకళ..
# పోటెత్తిన భారీ వరద..26గేట్లు ఎత్తివేత



నల్లగొండ: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు డ్యాంలోకి భారీగా వరద నీరు వచ్చిచేరుతోంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.బుధవారం (జూలై30) సాయంత్రానికి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 2లక్షల 82వేల 364 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 586 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 300.3200.టీఎంసీలుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టుమొత్తం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో 16 గేట్లు 5ఫీట్ల మేర, 10 గేట్లు 10ఫీట్ల మేర ఎత్తి 2లక్షల 65వేల 08 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు అధికారు. ఇక ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్తు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# జగన్ లో ఇంత అనూహ్య మార్పు వెనక మ్యాటర్ ఏంటి... ?



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు తామే అండగా ఉన్నామని తామే కేరాఫ్ గా నిలిచామని పదే పదే చెప్పుకున్న వైసిపి అధినేత జగన్ తాజాగా ఈ విషయాన్ని పక్కన పెట్టారని తెలుస్తోంది. సాధారణంగా గత ఐదు సంవత్సరాల పరిపాలనను పరిగణలోకి తీసుకుంటే జగన్ ఎక్కడ ఎప్పుడు మాట్లాడినా.. ఏ సందర్భం వచ్చినా 'నా.. ఎస్సీ నా ఎస్టి నా మైనారిటీ' అంటూ ప్రసంగాలు దంచి కొట్టిన విషయం తెలిసిందే. ఒక ప్రసంగాల్లోనే కాదు పనులు కూడా అలాగే చేశారు. అయితే అనూహ్యంగా గత ఎన్నికల్లో వచ్చిన వ్యతిరేక ఫలితంతో పాటు ఎస్సీ ఎస్టీ నియోజకవర్గంలోనూ ఆశించిన విధంగా వైసీపీ పుంజుకోలేకపోయింది.

దీనిపై జగన్ ఇంకా అంతర్మథనం చెందుతూనే ఉన్నారు. మనం ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు ఎన్నో మేలు చేశామని అయినా గత ఎన్నికల్లో వారు ఆదరించలేదనేది జగన్ మరోసారి చెప్పుకొచ్చారు. పార్టీ పీఏసీ సమావేశంలో ప్రభుత్వంపై నిప్పులు జరుగుతూనే పోలీసులను విమర్శిస్తూనే అంతర్గతంగా గత ఎన్నికల్లో జరిగిన పరిణామాలను జగన్ ప్రస్తావిస్తూ ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలను మాత్రమే మనం నమ్ముకున్నామని తద్వారా కొన్ని వర్గాలు దూరం అయ్యాయని ఇకనుంచి అటువంటి విధానాన్ని పక్కనపెట్టి భవిష్యత్తు అంతా అందరినీ కలుపుకుని పోయేలాగా ముందుకు సాగుదాం అని ఆయన సూచించారు.

ఇది మెరుగైన సూచన. మేలిమి సూచన అనే చెప్పాలి. ఎందుకంటే కొన్ని వర్గాలకే పరిమితం కావడం కొందరిని వెనకేసుకు రావడం అనేది ఏ రాజకీయ పార్టీకి కూడా మంచిది కాదు. అన్ని వర్గాలను సమానంగా చూస్తూ ఒకటి రెండు సామాజిక వర్గాలను కొంతమేరకు హెల్ప్ చేసినా ఇబ్బంది ఉండేది కాదు. కానీ నా ఎస్సీ నా ఎస్టీ నా బీసీ నామైనారిటీ అంటూ జగన్ చేసిన హడావిడి ఫలితంగా అటూ రెడ్లు ఇటు ఇతర సామాజిక వర్గాలు కూడా పార్టీకి, వ్యక్తిగతంగా జగన్‌కు దూరమయ్యాయి. ఇది గత ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపించింది. అందరూ కలిసి వచ్చి ఓట్లు వేస్తేనే ఎవరైనా అధికారంలోకి వస్తారు.

ఈ విషయాన్ని నెమ్మదిగా గ్రహించిన జగన్ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకనుంచి అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని పోయేలాగా, ఎవరిని దూరంపెట్టేలాగా వ్యవహరించకుండా నాయకులు ముందుకు సాగాలని ఆయన చెప్పుకొచ్చారు. వాస్తవానికి నాయకులు అందరిని కలుపుకునే వెళ్తున్నారు. ఇటు వచ్చి అధిష్టానం దగ్గరే తేడా కొట్టింది. ఇప్పుడు ఆ మార్పు దిశగా జగన్ అడుగులు వేసేందుకు సిద్ధమయ్యారు.కాబట్టి భవిష్యత్తులో కోల్పోయిన ఓటు బ్యాంకు తిరిగి వచ్చే అవకాశం ఉంటుందా ఉండదా అనేది ఆయన వ్యవహరించే శైలి తీరును బట్టి మాత్రమే ఆధారపడి ఉంటుంది. ప్రధానంగా కమ్మ కాపు సామాజిక వర్గాల్లో వైసిపి పట్ల ఏర్పడిన వ్యతిరేకతను సాధ్యమైనంత వరకు తగ్గించడం ద్వారా మాత్రమే జగన్ పుంజుకునే అవకాశం ఉంటుంది. లేకపోతే ఇబ్బందికర పరిస్థితులు తప్పవు.

# తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్: ఇకపై ఏ రోజుకారోజు శ్రీవాణి దర్శనం..



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీవాణి దర్శనం టికెట్ల విషయంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏ రోజుకారోజు శ్రీవాణి దర్శన టికెట్లు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది టీటీడీ. ఆగస్టు 1 నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని ఒక ప్రకటనలో తెలిపింది టీటీడీ. శ్రీవాణి దర్శన టికెట్లు ఆఫ్ లైన్లో తీసుకొని దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి. బుధవారం ( జులై 30 ) తిరుమలలోని గోకులం కాన్ఫరెన్స్ హాల్ లో శ్రీవాణి దర్శనాలపై సమీక్ష నిర్వహించిన వెంకయ్య చౌదరి ఈమేరకు నిర్ణయాన్ని ప్రకటించారు.శ్రీవాణి దర్శనం విషయంలో ప్రస్తుతం విధానం వల్ల సదరు టికెట్ దర్శనం కోసం భక్తులు సుమారు మూడు రోజుల వేచి ఉండాల్సి వస్తోందని.. వారి సౌకర్యం కోసం ఏ రోజుకారోజు టికెట్ జారీ చేసి దర్శనం కల్పించాలని నిర్ణయించింది టీటీడీ. ఆగస్టు 1 నుంచి 15 వరకు ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. తిరుమలలో ఉదయం 10 గంటల నుండి మొదట వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన టికెట్ల జారీ చేయాలని.. టికెట్లను పొందిన శ్రీవాణి భక్తులకు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1 దగ్గర అదే రోజు సాయంత్రం 4 :30 గంటలకు రిపోర్టింగ్ టైం ఇవ్వాలని తెలిపింది టీటీడీ.

రేణిగుంట విమానాశ్రయంలో ఉదయం 7 గంటల నుండి దర్శన టికెట్లు కోటా ఉన్నంతవరకు ఇవ్వాలని.. యథావిధిగా తిరుమలలో ఆఫ్ లైన్ ద్వారా 800 టికెట్లు, రేణిగుంట విమానాశ్రయంలో 200 టికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ద్వారా అక్టోబర్ 31వ తేది వరకు ఆన్ లైన్ లో శ్రీవాణి టికెట్లను పొందిన భక్తులకు యథావిధిగా ఉదయం 10 గంటలకే దర్శనానికి అనుమతిచనున్నట్లు తెలిపింది టీటీడీ. నవంబర్ 1వ తేది నుండి శ్రీవాణి టికెట్లను ఆఫ్ లైన్, ఆన్ లైన్ టికెట్లు పొందిన భక్తులకు సాయంత్రం 4:30 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1 ద్వారా శ్రీవారి దర్శనానికి అనుమతివ్వనున్నట్లు తెలిపింది. భక్తులు ముందుగా కౌంటర్ల దగ్గరకు చేరుకుని తాము ఇబ్బంది పడకుండా ఉదయం 10 గంటలకు మాత్రమే తిరుమలలోని శ్రీవాణి టికెట్ జారీ కేంద్రానికి చేరుకోవాలని కోరింది టీటీడీ. ఈ నూతన విధానం తో భక్తులు శీఘ్రంగా అనగా వచ్చిన రోజునే దర్శనం చేసుకునే వెసులుబాటుని గ్రహించ గలరు.

# 'మహా అవతార్ నరసింహ' వసూళ్ల గర్జన..
# బాక్సాఫీస్ వద్ద తొలి యానిమేషన్ చిత్రంగా రికార్డు!

**హైదరాబాద్ పెన్ పవర్:** 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద గర్జిస్తుం ది. ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా జూలై 25న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. మొదటి రోజు ఇండియాలో రూ. 1.75 కోట్లు వసూలు చేసింది. పాజిటివ్ టాక్ రావడంతో రోజు రోజుకు కలెక్షన్స్ పెరుగుతున్నాయి. ఈ ఐదు రోజుల్లోనే దాదాపు రూ. 30 కోట్ల మేర రాబట్టింది. ఒక్క హిందీ వెర్షన్ నుంచి రూ. 20.65 కోట్లు కొల్లగొట్టేసిందని ట్రేడ్ వెబ్సైట్ సక్నిల్క్ తెలిపింది.. మంగళవారం ( జూలై 29, 2025 ) ఒక్క రోజే రూ. 7.41 కోట్లు ఆర్జించిందంటే ఈ మూవీ క్రేజ్ ఎలా పెరిగిపోతుందో అర్థం చేసుకోవచ్చు.

సలార్ , కేజీఎఫ్ చాప్టర్ 2 చిత్రాలను నిర్మించిన హొంబలే ఫిల్మ్స్ యానిమేటెడ్ యాక్షన్ డ్రామా ' మహావతార్ నరసింహ'తో మరో బ్లాక్ బస్టర్ ను అందించింది. విడుదలైనప్పటి నుంచీ అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతున్న ఈ యానిమేషన్ చిత్రం, విమర్శకుల ప్రశంసలు అందుకుంటుంది. ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఈ అద్భుతమైన ఆదరణ పట్ల చిత్ర బృందం, ముఖ్యంగా నిర్మాతలు, తమ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.'మహా అవతార్ నరసింహ' కేవలం ఒక యానిమేషన్ చిత్రం కాదు, ఇది ఒక సాంస్కృతిక సంచలనం. 2005 తర్వాత బాక్సాఫీస్ వద్ద ఇంతటి ప్రభంజనం సృష్టించిన తొలి యానిమేషన్ చిత్రంగా నిలిచి, సరికొత్త మైలురాయిని అధిగమించింది. ఈ చిత్రం సాధించిన విజయం పట్ల చిత్ర బృందం ఎంతో భావోద్వేగానికి లోనైంది. కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులతో ఈ చిత్రం ఒక లోతైన ఆధ్యాత్మిక, భావోద్వేగ బంధాన్ని ఏర్పరచుకుందని తెలిపారు. హొంబలే ఫిల్మ్స్ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ, "సినిమా విశ్వాసాలకు వేదికైనప్పుడు... #Mahavatar Narsimha ధర్మశక్తితో భారతదేశం అంతటా హృదయాలను ఏకం చేసింది. మీ దగ్గర్లోని సినిమా హాళ్లలో దివ్య దర్శనం చూడండి" అని పంచుకుంది. ఇది కేవలం ఒక సినిమా అనుభవం కాదని, ఒక ఆధ్యాత్మిక అనుభూతి అనీ, భక్తి, పురాణాలు, ధర్మం యొక్క సారాంశాన్ని దాని చిత్రీకరణతో ప్రేక్షకులను ఆకర్షించి, ఒక సాంస్కృతిక ఉద్యమంగా మారిందని పోస్ట్ చేశారు.అశ్విన్ కుమార్ దర్శకత్వంలో, శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ ల నిర్మాణం లో క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై 'మహా అవతార్ నరసింహ' రూపుదిద్దుకుంది. అద్భుతమైన విజువల్స్, గొప్ప సంస్కృతి, ఉన్నతమైన నాణ్యత, లోతైన కథనంతో ఈ చిత్రాని 3D, 2D1లో జూలై 25, 2025న ఐదు భాషలలో విడుదల అయ్యింది. హొంబలె ఫిలిమ్స్ , క్లీమ్ ప్రొడక్షన్స్ రాబోయే దశాబ్ద కాలానికి సంబంధించిన తమ ప్రతిష్ఠాత్మక యానిమేషన్ ఫ్రాంచైజీ లైనప్‌ను కూడా వెల్లడించింది. మహా అవతార్ పరశురామ్ (2027), మహా అవతార్ రఘునందన్ (2029), మహా అవతార్ ద్వారకాధీష్ (2031), మహా అవతార్ గోకులనంద (2033), మహా అవతార్ కల్కి పార్ట్ 1 (2035), మహా అవతార్ కల్కి పార్ట్ 2 (2037). ఈ యానిమేషన్ ఫ్రాంచైజీ భారతీయ ఆధ్యాత్మికతను, పౌరాణిక కథలను ప్రపంచానికి చాటి చెప్పడంలో కీలక పాత్ర పోషిస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 16 మంది వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలోకి జంప్ నా ?




**హైదరాబాద్ పెన్ పవర్:** జంపింగ్ లకు నో అన్ సీజన్. రాజకీయాల్లో ఎపుడైనా అవి జరగవచ్చు. అటూ ఇటూ రాయబేరాలు సరిపోతే గోడ మీద నుంచి దూకేయడమే. ఆ పార్టీ ఈ పార్టీ అని కాదు రాజకీయలో థియరీ ఇదే. నీతీ రీతి కూడా ఇలాగే ఉంటుంది. అందుకే దానికి పాలిటిక్స్ అనడం లేదు. పాలిట్రిక్స్ అంటారు. ఇపుడు చూస్తే జంపింగుల ప్రాక్టీస్ ఎవరికి అవసరం అంటే కష్టాల్లో ఉన్న వైసీపీ మాజీలకే అని అంటున్నారు. కూటమి కట్టి మూడు పార్టీలు ఐక్యంగా బలంగా ఉన్నాయి. విపక్షంలో ఉన్న వైసీపీని గట్టిగానే టార్గెట్ చేస్తున్నాయి.

**వరస కేసులు అరెస్టులూ :**

ఇదిలా ఉంటే వైసీపీ నేతలందరికీ ఇపుడు ఒక్కటే బెంగ పట్టుకుంది. కేసులు అరెస్టులే ఆ భయం. కేసు పెట్టిన వారు సక్రమం అంటారు, పెట్టించుకున్న వారు అక్రమం అంటారు. ఈ గోల ఘోష ఎలా ఉన్నా బాధితులుగా మాత్రం మారి జైలు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తోంది. ఇక ఒకసారి జైలుకు వెళ్తే ఒకటి కంటే ఎక్కువ కేసులు వరసగా కలుపుకుని పోతున్నారు. దాంతో ఎపుడు బయటకు బెయిల్ మీద వస్తారో కూడా అంతు చిక్కడం లేదు. దాంతో ఇపుడు వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రులలో ఈ అరెస్టు భయాలు గట్టిగానే పట్టుకున్నాయని అంటున్నారు.

**కలవరపెడుతున్న రెడ్ బుక్ :**

బయటకు రెడ్ బుక్ రాజ్యాంగం అని ఎంత విమర్శించినా కూటమి ప్రభుత్వాన్ని ఎంతగా నిందించినా అరెస్టులు అలా జరిగిపోతూనే ఉన్నాయి. దాంతో వైసీపీ మాజీలు అంతా రెడ్ బుక్ కేసుల మీదనే అందోళన పడుతున్నారు. రెడ్ బుక్ లో తమ పేర్లు ఉన్నాయనో లేక ఉంటాయనో వారు అంతా కలవరం చెందుతున్నారు అని అంటున్నారు. వైసీపీ నేతలలో భయం అంతకంతకు పెరిగిపోతోంది. ఇది అందరికీ స్పష్టంగా కనిపిస్తోంది అని అంటున్నారు.

**జగన్ ఎన్ని చెప్పినా :**

నిజానికి పార్టీ నాయకులలో ధైర్యం నింపడానికి జగన్ ఎంత ప్రయత్నం చేసినా అది అంతగా ఫలించడం లేదు అని అంటున్నారు. మన ప్రభుత్వం వస్తే అందరికీ చుక్కలు చూపిస్తామని లెక్కలు తేలుస్తామని సినిమా చూపిస్తామని జగన్ చెప్పవచ్చు కాక కానీ ఇపుడు కూటమి వారి చేతిలో అధికారం ఉంది. దాంతో వారు కచ్చితంగా ఆ సినిమాను చుక్కలను చూపిస్తున్నారు అని వైసీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్ అధికారంలోకి వస్తే అంటున్నారు. కానీ ఈ లోగా నేతలను తీసుకెళ్ళి జైలులో వేస్తే సమాజంలో పరువు దెబ్బతినిపోతుంది కదా అన్నది కూడా వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రులలో కలవరంగా ఉంది అని అంటున్నారు.

**డౌట్ ఉంటే చాలు జంపే :**

రెడ్ బుక్ లో ఎవరి పేర్లు ఉన్నాయో ఎవరికీ తెలియదు. అయితే గత అయిదేళ్ళ తమ పాలను బేరీజు వేసుకునో లేక తాము ఎక్కడ ఏమి చేశామో రివీల్ చేసుకునో లేక తమ నియోజకవర్గంలో కూటమి నాయకుల దూకుడుని అంచనా కట్టుకునో చాలా మంది వైసీపీ నేతలు కొత్త ఆలోచనలు చేస్తున్నారు అని అంటున్నారు. రెడ్ బుక్ లో పేరు చేర్చేస్తున్నారు అని ఏ మాత్రం డౌట్ వస్తే చాలు వారు అంతా సేఫ్ జోన్ చూసుకోవడానికి సిద్ధపడుతున్నారని అంటున్నారు. ఈ విధంగా ఆలోచిస్తున్న నేతలకు జనసేన కంటే బీజేపీలోకి వెళ్తే సేఫ్ అని కూడా భావన కలుగుతోందిట.

**బీజేపీలోనే భద్రం :**

ఎందుకంటే ఏపీ బీజేపీ వీక్ గా ఉంది. పైగా అందులో చేరితే నాయకత్వం పోరు ఉండదు, ఇక పార్టీ కూడా అక్కున చేర్చుకుని కాషాయం కండువా కప్పేస్తుంది. ఆ మీదట అతి పెద్ద రక్షణ కవచం దొరికినట్లే అని అంటున్నారు. ఎటూ ఏపీలో బీజేపీని బలోపేతం చేయాలన్న ఆలోచన వారిలో ఉంది. దాంతో దీనినే సాకుగా తీసుకుని కమలానికి రాయబారాలు పంపే వైసీపీ మాజీల లిస్ట్ బాగా పెరిపోతుందని అంటున్నారు.

**వీరంతా కమల కుటీరంలోకేనా :**

ఏపీ వైసీపీలో ఉన్న పదహారు మంది మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నాయకులు అంతా బీజేపీలోకి జంప్ చేయడానికి రెడీ అయ్యారని వార్తలు గుప్పుమంటున్నాయి. వీరంతా ప్రస్తుతానికి బీజేపీలోనే తాము ఉండడం అన్ని రకాలుగా మేలు అని భావిస్తున్నరుట. బీజేపీ కూటమిలో ఉంది. పైగా కేంద్రంలో బలంగా ఉంది. దాంతో కమలం పువ్వు పట్టుకుంటే చాలు ఎవరూ తమ జోలికి రారు అని బాగానే రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు అని అంటున్నారు.

**వైసీపీ సంగతి అపుడే :**

వైసీపీ నుంచి బీజేపీలోకి వెళ్ళాలని చూస్తున్న వారు ఆ పార్టీ మీద అభిమానం లేక కాదని అంటున్నారు. తాము రెడ్ బుక్ నుంచి తప్పించుకోవడానికే అంటున్నారు. ఒకవేళ 2029 ఎన్నికల నాటికి ఏపీలో వైసీపీ వచ్చే అవకాశం ఉంటే కనుక మళ్ళీ ఎన్నికల ముందు ఈ వైపునకు రావచ్చు అన్న లెక్కలు కూడా ఉన్నాయట. అవసరం అయితే కులం కార్డు కూడా తీసి అయినా వైసీపీలోకి తిరిగి రావచ్చు. కానీ ప్రస్తుతం మాత్రం ఫ్యాన్ నీడన ఉండడం రాజకీయంగా ఇబ్బందికరం అని భావిస్తున్నారు అని చెబుతున్నారు. మొత్తానికి చూస్తే ఒకేసారి పదహారు మంది వైసీపీ నుంచి పెద్ద తలకాయలు బీజేపీలోకి వెళ్తారు అంటే గుడ్ నంబర్ గానే చూడాలి. బీజేపీకి ఇది అతి పెద్ద రాజకీయ అవకాశంగా చూస్తున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# 42 నెలల నిషేధం తర్వాత జింబాబ్వే స్టార్ క్రికెటర్ రీ ఎంట్రీ



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ కెప్టెన్ బ్రెండన్ టేలర్ పై ఐసీసీ నిషేధం ముగిసింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు మూడున్నర సంవత్సరాల నిషేధం అనుభవించిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేయనున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగే రెండో టెస్ట్ మ్యాచ్‌తో బ్యాన్ తర్వాత క్రికెట్ లోకి రీ ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమైపోయాడు. టేలర్ నిషేధం జూలై 25న ముగిసింది. ఆగస్టు 7 నుండి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న రెండో టెస్టుకు జింబాబ్వే జట్టులో అతనికి చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. టేలర్ రెండో టెస్ట్ కు అందుబాటులో ఉంటాడని జింబాబ్వే కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ కన్ఫర్మ్ చేశాడు. "గత ఏడాది కాలంగా టేలర్ ఎంతలా కష్ట పడుతున్నాడో నాకు తెలుసు. కొద్ది రోజుల్లో అతను తిరిగి క్రికెట్ ఆడడం పట్ల నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను". అని ఎర్విన్ తెలిపాడు. 39 ఏళ్ల టేలర్ సెప్టెంబర్ 2021లో అకస్మాత్తుగా రిటైర్ అయిన తర్వాత ఎలాంటి క్రికెట్ ఆడుతూ కనిపించలేదు. టేలర్ 2004 నుంచి 2021 మధ్య జింబాబ్వే తరపున 34 టెస్టులు ఆడాడు. 36.25 యావరేజ్ తో 2320 పరుగులు చేశాడు. వీటిలో 6 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

**అసలేం జరిగిందంటే..?**

2022 లో బ్రెండన్ టేలర్ పై ఐసీసీ బ్యాన్ విధించింది. ఫిక్సింగ్ కు పాల్పడ్డాడని ఒప్పుకున్న టేలర్ కు..ఐసీసీ యాంటీ కరప్షన్ కోడ్ లో ఐసీసీ యాంటీ డోపింగ్ కోడ్ ను ఉల్లంఘించినందుకు అతడి మీద మూడున్నరేళ్ల పాటు నిషేధం వేసింది. 2019లో ఓ భారత వ్యాపారవేత్త, తనను మ్యాచ్ ఫిక్సింగ్ చేయమని బెదిరించాడని, అందుకు అతను 15 వేల అమెరికన్ డాలర్లు ఆఫర్ చేశాడని ట్విటర్ వేదికగా ఆరోపణలు చేయడం అప్పట్లో సంచలనం గా మారింది. 2021 సెప్టెంబర్‌లో ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టేలర్.. 2019లో ఓ ప్రముఖ భారత వ్యాపారవేత్త ఆహ్వానం మేరకు భారత్‌కు వచ్చానని, ఆ సందర్భంగా ఓ పార్టీలో కొందరు తనకు కొకైన్ ఆఫర్ చేశారన్నాడు. తాను కొకైన్ సేవిస్తుండగా వీడియోలు తీసి బెదిరించడం మొదలుపెట్టారని, ఈ క్రమంలోనే మ్యాచ్ ఫిక్సింగ్ కూడా చేయమన్నారని సంచలన స్టేట్‌మెంట్‌ను విడుదల చేశాడు.

# పాకిస్తాన్‌తో సెమీఫైనల్ మ్యాచ్ రద్దు చేసుకున్న ఇండియా ఛాంపియన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ లో భాగంగా ఇండియా, పాకిస్తాన్ మధ్య జరగాల్సిన సెమీ ఫైనల్ మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా చాలామంది భారత ఆటగాళ్లు పాకిస్థాన్ తో మ్యాచ్ బహిష్కరించాలని కోరుకుంటున్నారని సమాచారం. గ్రూప్ దశలో పాకిస్థాన్ తో ఇండియా ఆడడానికి నిరాకరించడంతో మ్యాచ్ ను రద్దు చేసి ఇరు జట్లకు చెరొక పాయింట్ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శిఖర్ ధవన్ సహా పలువురు ఇండియా వెటరన్ ప్లేయర్లు పాకిస్థాన్ తో లీగ్ మ్యాచ్ ఆడేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. సెమీ ఫైనల్ అయినప్పటికీ తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని భారత మాజీ క్రికెటర్లు తెలిపారట. గురువారం (జూలై 31) బర్మింగ్ హోమ్ వేదికగా ఇండియా ఛాంపియన్స్, పాకిస్థాన్ ఛాంపియన్స్ జట్ల మధ్య సెమీస్ ఫైనల్ జరగనుంది. అయితే, మ్యాచ్ ముందు రోజు భారత జట్టు స్పాన్సర్‌లలో ఒకరైన ఈజ్‌మైట్రిప్ ఉగ్రవాదం, క్రికెట్ కలిసి ఉండలేవని చెబుతూ సెమీ ఫైనల్ నుంచి వైదొలిగింది. కంపెనీ వ్యవస్థాపకుడు నిశాంత్ పిట్టి మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ టోర్నమెంట్‌లో సెమీ-ఫైనల్‌కు చేరుకున్నందుకు ఇండియా ఛాంపియన్‌లను తాము అభినందిస్తున్నప్పటికీ, పాకిస్తాన్ పాల్గొన్న మ్యాచ్‌లతో సంబంధం కలిగి ఉండటానికి తాము ఇష్టపడటం లేదని అన్నారు.కొన్ని రోజుల క్రితమే టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ పాకిస్థాన్ తో నాకౌట్ మ్యాచ్ అయినా ఆడేది లేదని తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పాడు. రూల్స్ ప్రకారం.. ఇండియా ఛాంపియన్స్ సెమీ-ఫైనల్‌లో పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో ఆడటానికి నిరాకరిస్తే మొహమ్మద్ హఫీజ్ కెప్టెన్సీలోని పాకిస్థాన్ ఛాంపియన్స్ జట్టుకు వాకోవర్ లభిస్తుంది. దీంతో పాకిస్తాన్ ఛాంపియన్స్ సెమీస్ ఆడకుండానే ఫైనల్‌కు చేరుకుంటుంది.

ఇండియా ఈ మ్యాచ్ లో ఆడే అవకాశం లేనందున పాకిస్థాన్ ఛాంపియన్స్ సెమీస్ ఆడకుండానే ఫైనల్లో అడుగు పెట్టబోతోంది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్ల మధ్య మరో సెమీస్ జరుగుతుంది.

# మనోడే నెంబర్ 1: టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్న అభిషేక్ శర్మ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యువ సంచలనం అభిషేక్ శర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో నెంబర్ స్థానంలో నిలిచాడు. బుధవారం (జూలై 30) ఐసీసీ రిలీజ్ చేసిన టీ20 ర్యాంకింగ్స్ లో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. టీ20 ఫార్మాట్ లో విరాట్ కోహ్లీ, సూర్య కుమార్ యాదవ్ తర్వాత నెంబర్ వన్ స్థానానికి చేరుకున్న మూడో ఇండియన్ గా చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం అభిషేక్ శర్మ ఖాతాలో 829 రేటింగ్ పాయింట్లు ఉండగా.. 814 పాయింట్లతో హెడ్ రెండో స్థానానికి పడిపోయాడు. ఇటీవలే జరిగిన వెస్టిండీస్ తో జరిగిన 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో హెడ్ ఆడకపోవడంతో రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2024 లో జింబాబ్వేపై తన కెరీర్ లో తొలి టీ20 సెంచరీ చేసి సత్తా చాటిన అభిషేక్.. నిలకడతో పాటు వేగంగా రాణిస్తూ భారత జట్టులో చోటు పదిలం చేసుకున్నాడు. 2025 లో ఇంగ్లాండ్ పై జరిగిన ఐదో టీ20లో 37 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. 2024 టీ20 వరల్డ్ కప్ సమయంలో సూర్యను అధిగమించి టాప్ కు చేరుకున్న హెడ్.. ఏడాది తర్వాత టీ 20 ఫార్మాట్ లో తన నెంబర్ వన్ ర్యాంక్ ను అభిషేక్ శర్మకు కోల్పోవాల్సి వచ్చింది. టీమిండియా బ్యాటర్లల్లో తిలక్ వర్మ మూడో స్థానంలో.. కెప్టెన్ సూర్యకుమార్ ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. టాప్- 10 లో ఉన్న జైశ్వాల్ రెండు స్థానాలు కోల్పోయి 11 వ స్థానానికి పడిపోయాడు.

ఇంగ్లాండ్ ఓపెనర్లు సాల్ట్, బట్లర్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. బౌలింగ్ విషయానికి వస్తే న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ జాకబ్ డాఫి అగ్ర స్థానంలో ఉన్నాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి మూడో స్థానంలో.. అర్షదీప్ సింగ్ పదో స్థానంలో కొనసాగుతున్నారు. టీమ్స్ విషయానికి వస్తే ఇండియా టీ20 ర్యాంకింగ్స్ లో టాప్ లో ఉంది. ఆల్ రౌండర్ విభాగంలో టీమిండియా స్టార్ హార్దిక్ పాండ్య అగ్ర స్థానంలోనే ఉన్నాడు.

**మస్టర్డ్ చీరలో నిర్మలమైన రూఫ్‌టాప్ మూమెంట్‌ను పంచుకున్న మహిరా శర్మ**



# ఎన్టీఆర్ సినిమాలో త్రివిక్రం ఛాయిస్ ఎవరు..?



మహేష్ తో గుంటూరు కారం తర్వాత త్రివిక్రమ్ కూడా ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఫిక్స్ చేసుకున్నాడు. ముందు హీరోగా అల్లు అర్జున్ అనుకోవడం ఆ తర్వాత ఆయన ప్లేస్ లో ఎన్టీఆర్ రావడం అంతా తెలిసిందే. అసలు అల్లు అర్జున్ బదులుగా ఎన్టీఆర్ ని ఎందుకు రీ ప్లేస్ చేశారా అన్నది మాత్రం తెలియలేదు. ఇదిలా ఉంటే ఈ సినిమా మురుగన్ కుమారస్వామి గురించి ఉంటుందని ఇప్పటికే నిర్మాత నాగ వంశీ హింట్ ఇచ్చాడు. ఆమధ్య ఎన్టీఆర్ మురుగన్ బుక్ తో కనిపించే సరికి ఈ మాటకు ఇంకాస్త బలం వచ్చింది.

**డ్రాగన్ టైటిల్ తో ఎన్టీఆర్..**

వార్ 2 రిలీజ్ బిజీలో ఉన్న ఎన్టీఆర్ ఓ పక్క ప్రశాంత్ నీల్ సినిమాను కూడా పూర్తి చేసే పనుల్లో ఉన్నాడు. ఆ సినిమా ఎక్స్ ఇయర్ సమ్మర్ కి ఎలాగైనా తీసుకు రావాలని గట్టి ప్లానింగ్ తో వెళ్తున్నారు. డ్రాగన్ టైటిల్ తో వస్తున్న ఆ సినిమా గురించి ప్రతి అప్డేట్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ త్రివిక్రమ్ సినిమా ఈ ఇయర్ లోనే సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో సెట్స్ మీదకు వెళ్తుందని తెలుస్తుంది.

ఐతే ఎన్టీఆర్ గురూజీ మూవీలో హీరోయిన్ ఎవరన్నది తెలియాల్సి ఉంది. ఆమధ్య ఎన్టీఆర్ చేతిలో ఉన్న పుస్తకమే మలయాళ నటి మడోన్నా సెబాస్టియన్ దగ్గర ఉందని హడావిడి చేశారు. అసలు మడోన్నా ఆ బుక్ ఎందుకు చదువుతుందా అన్న అనుమానాలు వచ్చాయి. మడోన్న గురించి కన్ఫర్మేషన్ అయితే ఏది రాలేదు. మరో హీరోయిన్ ఎవరైనా ఉంటారా అన్న డిస్కషన్స్ కూడా ఏమి జరగట్లేదు.

**ఎన్టీఆర్ మైథాలజీ సినిమా..**

ఎన్టీఆర్ త్రివిక్రం అరవింద సమేత సినిమాకు కలిసి పనిచేశారు. ఎన్టీఆర్ తో ఊర మాస్ సినిమా చేసినా అందులో తన మార్క్ కనిపించేలా చేశాడు గురూజీ. అందుకే త్రివిక్రం డైరెక్షన్ లో ఎన్టీఆర్ సినిమా అది కూడా మైథాలజీ అనేసరికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ కి ఈ ప్రాజెక్ట్ మీద ఆసక్తి ఎక్కువైంది. ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తేనే కానీ అసలు విషయాలు అన్ని ఒక్కొక్కటిగా తెలుస్తాయి. త్రివిక్రం మాత్రం ఈ సినిమాను తన కెరీర్ లో ఏ సినిమాకు చేయనంత గ్రాండ్ గా భారీగా ప్లాన్ చేస్తున్నారని అర్థమవుతుంది. మరి గురూజీ ఇలా కమిటై చేస్తున్న ఈ ప్రాజెక్ట్ ఏ రేంజ్ లో ఉంటుంది.. ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుంది అన్నది చూడాలి.



**చంద్రిక రవికి నో స్టాపింగ్**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com